

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 04-05-2026 | సంపుటి - 27 | సంచిక -342 | రూ : 4 | పేజీలు: 8




## భావితరానికి భవ్య నగరం

- ఫ్యూచర్‌సిటీ అభివృద్ధికి శరవేగంగా సన్నాహాలు
- ప్రారంభానికి సిద్ధమైన ఎఫ్‌సీడీఏ నూతన భవనం
- జోరుగా సాగుతున్న యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ పనులు
- మే, జూన్ మాసాల్లో పలు డేటా సెంటర్లు, లైఫ్ సైన్సెస్ కంపెనీలకు వరుస శంకుస్థాపనలు
- సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ, ప్రారంభోత్సవాలకు పరిశ్రమల శాఖ ఏర్పాట్లు

2లో

## యశోదాదేవి 'ఆనంద' పరవశం!

- తనయుడిని పోలీస్ బాస్‌గా చూసి మురిసిపోయిన తల్లి
- ఆమె చిరకాల వాంఛ నెరవేరిందని 'ఎక్స్'లో డీజీపీ వెల్లడి



2లో



2లో

### బోటింగ్ భద్రతపై సర్కార్ నజర్

## తెలంగాణలో కొత్త రూల్స్

- మధ్యప్రదేశ్ ప్రమాదం నేపథ్యంలో తెలంగాణలో బోటింగ్ భద్రతపై ఆంక్షలు
- రాష్ట్రంలోని అన్ని బోటింగ్ కేంద్రాలకు పర్యాటక అభివృద్ధి సంస్థ కొత్త ఆదేశాలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే యూనిట్ మేనేజర్లపై వేటు తప్పదని హెచ్చరిక
- ఓవర్ లోడింగ్, లైఫ్ జాకెట్ల విషయంలో రాజీ లేదని స్పష్టం చేసిన ప్రభుత్వం
- ప్రతికూల వాతావరణంలో బోటింగ్ సర్వీసులు నిలిపివేయాలని ఉత్తర్వులు

### కరీంనగర్‌లో కాల్పుల కలకలం

## జ్యువెలరీ షాపులో దోపిడీ

- కరీంనగర్ నడిబొడ్డున ఐదుగురు దుండగుల దుశ్చర్య
- తుపాకులతో చొరబడి బెదిరింపు
- ప్రతిఘటించిన నలుగురు సిబ్బందిపై కాల్పులు జరిపి.. కిలోకుపైగా బంగారు ఆభరణాలతో పరారీ
- తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న సిబ్బంది

2లో





### గతేడాదితో పోలిస్తే

## సులువుగానే 'నీట్'

- కటాఫ్ మార్కులు పెరిగే అవకాశం ఉందంటున్న నిపుణులు
- రాష్ట్రంలోని 180 కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్ష

అమరావతి, న్యూస్‌టుడే కానూరు: దేశవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన నీట్ (యూజీ) 2026 ప్రశ్నపత్రం గతేడాదితో పోలిస్తే సులువుగానే ఉందని నిపుణులు అభిప్రాయపడ్డారు. వృక్ష, జంతు, రసాయన,

తరువాయి 2లో



## మూడంచెల ప్రణాళిక

- యుద్ధం ముగింపునకు 14 పాయింట్లతో అమెరికాకు సమర్పించిన ఇరాన్
- దిగ్బంధనం ఎత్తివేయడం, హర్మూజ్‌ను తెరవడం తొలి దశలోనే..
- తాను అంగీకరించలేనివి అడుగుతున్నారని ట్రంప్ వ్యాఖ్య

2లో

## విదేశీ ప్రయాణాలపై పశ్చిమాసియా సెగ

- పశ్చిమాసియా సంక్షోభంతో మార్చిలో తగ్గిన అంతర్జాతీయ విమాన ప్రయాణాలు
- గత నెలలతో పోలిస్తే విదేశీ ప్రయాణికుల సంఖ్య 18.5 శాతం క్షీణత
- ఇంధన ధరల పెరుగుదల, గగనతలాల మూసివేత ప్రధాన కారణాలు
- మే నుంచి జులై వరకు అంతర్జాతీయ సర్వీసులు తగ్గించిన ఎయిర్ ఇండియా
- విమాన చార్జీల పెంపు, సర్వీసుల రద్దుతో ప్రయాణికులపై ప్రభావం

2లో






## ఫలితాలకు వేళాయె

- 4 రాష్ట్రాలు, పుదుచ్చేరిలో నేడే ఓట్ల లెక్కింపు
- దేశవ్యాప్తంగా ఆసక్తి
- సంబరాలకు భారీగా మిఠాయిల తయారీ

ఢిల్లీ: కాళ్లకు చక్రాలు కట్టుకుని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన విస్తృత ప్రచారం ఎంత మేరకు ఫలిస్తుంది.. కేంద్రంలోని అధికార కూటమిపై విపక్షాలు ఎక్కుపెట్టిన అస్త్రాలు ఏ మేరకు విజయవంతమయ్యాయి.. దేశంలో భిన్న ప్రాంతాల్లో ఓటర్ల మనోగతం ఎలా ఉంది.. అనేది సోమవారం తేలిపోనుంది. హోరాహోరీగా

తరువాయి 2లో

# భావితరానికి భవ్య నగరం

హైదరాబాద్: భారతదేశానికే తలమానికంగా ఉండేలా.. భావితరాలకు భవ్య నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా సన్నాహాలు చేస్తోంది. భారత నగరీకరణను దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ దక్షిణ ప్రాంతంలో 765 చ.కి.మీ. విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ నగరంలో.. భావి పౌరులకు సమ్మిళిత నగరాన్ని అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇక్కడ అన్నింటా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తారు. నివాస సముదాయాల నుంచి నడక దూరంలోనే విద్య, వైద్య, ఉపాధి, ఉద్యోగ, వినోద సంస్థలు ఉండేలా ప్రణాళికలు రూపొందించారు. మే, జూన్ మాసాల్లో ఇక్కడ భారీగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. సకల హంగులతో నిర్మించిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) నూతన భవనాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈనెలలోనే ప్రారంభోత్సవం చేయించడానికి పరిశ్రమల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇటీవలే ఇక్కడ పోలీస్ కమిషనరేట్ భవనానికి ఆయన భూమి పూజ చేశారు. జూన్ 2వ తేదీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవానికి ముందే.. పలు డేటా సెంటర్లు, లైఫ్ సైన్సెస్ కంపెనీలకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్నట్లు పరిశ్రమల శాఖ పేర్కొంది. 2025 డిసెంబరులో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో సంస్థల్ని నెలకొల్పేందుకు ముందుకు వచ్చిన అనేక కంపెనీలతో అధికారులు సమన్వయం చేసుకుంటున్నారు. కొన్ని నెలల్లో అవి కూడా ఇక్కడ కార్యరూపం దాల్చనున్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సీఎం ఆదేశాలతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (వైఐఎస్‌యూ) శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనుల్లో వేగం పెరిగిందని అధికారులు చెబుతున్నారు. ఈ క్యాంపస్‌ను జులైలో ప్రారంభించడానికి పరిశ్రమల శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

**మాస్టర్ ప్లాన్ తయారీ**

దేశంలోనే మొదటి నెట్ జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా రూపొందుతున్న ఈ ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నీటి పునర్వినియోగం, ఆకుపచ్చని తోటలు, అధునాతన మౌలిక సదుపాయాలు తదితర దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించారు. పునరుత్పాదక ఇంధనం, పర్యావరణ అనుకూల రవాణా, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ తయారు చేస్తున్నారు.

**బఫర్‌గా ఆకుపచ్చ కారిడార్**

పారిశ్రామిక జోన్‌లు, వ్యాపార కేంద్రాల మధ్య ఆకుపచ్చ కారిడార్ బఫర్‌గా పనిచేస్తుంది. విశాలమైన అటవీ, పాకెట్ పార్కుల నెట్‌వర్క్‌తో 'భవిష్య నగరం' ఆకుపచ్చ వాతావరణాన్ని బలోపేతం చేస్తుంది. నివాస సముదాయాల నిర్మాణంలోనూ ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. సమీపంలోని రిజర్వ్ అటవీ ప్రాంతాన్ని సుందర దృశ్యంగా తీర్చిదిద్దనున్నారు. వీటికి తోడుగా.. ఇప్పటికే ఉన్న జలవనరులు, జంతు ప్రదర్శనశాల, ఎకో టూరిజం జోన్‌లను సంరక్షిస్తారు.

* **వర్షపు నీటి నిర్వహణకు స్పాంజ్ పార్కులు**

పారిశ్రామిక, నివాసిత ప్రాంతాల్లో వర్షపు నీటి నిర్వహణ కోసం స్పాంజ్ పార్కులు నెలకొల్పుతున్నారు. ఇవి సహజంగా నీటిని గ్రహించి, వరదలను నివారిస్తాయి. రోజువారీ నీటి డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని.. పునర్వినియోగ నీటి పద్ధతిని అమలు చేయనున్నారు. జీరో లిక్విడ్ డిశ్చార్జ్ సాధించడంపై దృష్టిపెట్టడం.. వాన నీటి సేకరణ, పునర్వినియోగ వ్యవస్థల ద్వారా సమర్థంగా నీటి కొరత తీరుతుందని.. బయటి నుంచి నీటిని సరఫరా చేసుకోవడం తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తుంది.

**శంకుస్థాపనలు ఇలా...**

* 202425లో రాష్ట్ర ప్రభుత్వంతో 17 లైఫ్ సైన్సెస్ కంపెనీలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. డా.రెడ్డీస్, భారత్ బయోటెక్, హెటిరో, ఎంఎస్ఎన్, అరబిందో వంటి ఫార్మా కంపెనీలకు చెందిన పర్యావరణహితంగా నడిచే అనేక పరిశోధనా కేంద్రాలు, ప్యాకేజింగ్ యూనిట్లకు శంకుస్థాపన చేయనున్నారు.
* డేటా సెంటర్లకు ఫ్యూచర్ సిటీలో ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ఇక్కడ 200 ఎకరాల్లో అమెజాన్ డేటా సెంటర్ విస్తరణకు.. కంట్రోల్ ఎస్, హైపర్‌వాల్ట్ తదితర కంపెనీల డేటా సెంటర్లకు సీఎం జూన్‌లో శంకుస్థాపన చేస్తారు.
* 25 ఎకరాల్లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించనున్నారు.
* 10 ఎకరాల్లో సింగరేణి ప్రధానకార్యాలయ భవనం శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నారు.
* లెదర్ ఇండస్ట్రీ అభివృద్ధికి విశ్వవిద్యాలయాన్ని ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. దీనికి జూన్‌లో శంకుస్థాపనకు సన్నాహాలు..

**గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్...**

ఫ్యూచర్ సిటీని అనేక జోన్లుగా విభజించి, అభివృద్ధి చేయనున్న నేపథ్యంలో.. వాటిని అనుసంధానం చేసే విధంగా ప్రధాన రోడ్లు, నీటి సరఫరా తదితర సదుపాయాల మొదటి దశ పనులకు సైతం సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఇందులో ప్రధానమైనది.. గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ (రేడియల్ రోడ్ నం. 1). ఈ రోడ్డు ఔటర్ రింగ్ రోడ్ వద్ద రావిర్యాల్ ఇంటర్‌ఛేంజ్ (టాటా ఇంటర్‌ఛేంజ్) నుంచి రీజినల్ రింగ్ రోడ్ వద్ద అమనగల్లు వరకు వెళ్తుంది. భారత్ ఫ్యూచర్ సిటీ.. ఎఫ్‌సీడీఏ కింద అభివృద్ధి చేస్తున్న పారిశ్రామిక కారిడార్‌లను కలుపుతూ ఈ రోడ్డును ప్రణాళిక చేశారు. ఎన్‌హెచ్ 19.. ఎన్‌హెచ్ 765పై ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గిస్తూ ఆధునిక ప్రత్యామ్నాయ మార్గాన్ని ఇది అందిస్తుంది.

## బోటింగ్ భద్రతపై సర్కార్ నజర్
# తెలంగాణలో కొత్త రూల్స్

హైదరాబాద్, మే 3 : మధ్యప్రదేశ్‌లోని బార్గి రిజర్వాయర్‌లో ఇటీవల జరిగిన ఘోర పడవ ప్రమాదం నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. పర్యాటకుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలోని అన్ని బోటింగ్ కేంద్రాల్లో కఠినమైన భద్రతా చర్యలను అమలు చేయాలని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (TGTDC) నిర్ణయించింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో పర్యాటకుల రద్దీ పెరుగుతున్నందున, బోటింగ్ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇకపై ఏ చిన్న పొరపాటు జరిగినా సంబంధిత యూనిట్ మేనేజర్లు, ఇన్‌ఛార్జ్‌లే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. వారాంతాలు, సెలవు దినాలు, పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో అధికారులు తప్పనిసరిగా బోటింగ్ యూనిట్ల వద్ద భౌతికంగా హాజరు కావాలని ఆదేశించింది. బోట్లలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం (ఓవర్ లోడింగ్), ప్రయాణికులకు లైఫ్ జాకెట్లు అందించకపోవడం వంటి ఉల్లంఘనలను ఏమాత్రం సహించేది లేదని ప్రభుత్వం తేల్చిచెప్పింది. నిబంధనలు అతిక్రమించిన వారిపై సస్పెన్షన్‌తో సహా కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నప్పుడు బోటింగ్ సర్వీసులను తక్షణమే నిలిపివేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రతి బోటింగ్ యూనిట్‌లో ప్రథమ చికిత్స కిట్లు, రెస్క్యూ పరికరాలు, అత్యవసర ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలని ఆదేశించింది. ప్రయాణికుల భద్రతే తమకు ముఖ్యమని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకే ఈ కొత్త మార్గదర్శకాలను జారీ చేశామని అధికారులు తెలిపారు.

# గతేడాదితో పోలిస్తే సులువుగానే 'నీట్'

అమరావతి: దేశవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన నీట్ (యూజీ) 2026 ప్రశ్నపత్రం గతేడాదితో పోలిస్తే సులువుగానే ఉందని నిపుణులు అభిప్రాయపడ్డారు. వృక్ష, జంతు, రసాయన, భౌతికశాస్త్రాల్లో ప్రశ్నలు మధ్యస్థంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎక్కువ ప్రశ్నలు జతచేసేలా, అధిక సమయం తీసుకునేలా ఉన్నాయని చెప్పారు. చాలా ప్రశ్నలు సులువుగా, మరికొన్ని కష్టంగా ఉన్నాయని.. విద్యార్థులు తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో రాష్ట్రంలో 25 పట్టణాల్లోని 180 కేంద్రాల్లో నిర్వహించిన నీట్ ప్రశాంతంగా ముగిసింది. పోలీసు బందోబస్తు నడుమ మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష సాగింది. సమయానికి రానివారిని అనుమతించకపోవడంతో పలువురు పరీక్ష రాయలేకపోయారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పరీక్షకు 45 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా 96% మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, రాజమహేంద్రవరం, కాకినాడ, విశాఖపట్నం, విజయవాడ, మంగళగిరి, మచిలీపట్నం, గూడూరు, ఏలూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, గుంటూరు, తెనాలి, ఒంగోలు, చీరాల, చిత్తూరు, అనంతపురం, గుత్తి, నంద్యాల, కర్నూలు, ప్రొద్దుటూరు, కడప, నెల్లూరు, తిరుపతిలో ఈ పరీక్ష నిర్వహించారు. ఉదయం 9.30 నుంచే కేంద్రాల వద్ద తాకిడి కనిపించింది. చాలాచోట్ల మండుటెండల్లో నిరీక్షించాల్సి వచ్చింది. 'నీట్ ప్రశ్నావళి గతేడాది కన్నా సులువుగా ఉంది. బయాలజీ, కెమిస్ట్రీలో ప్రశ్నలు సులభంగా, ఫిజిక్స్ కొంచెం కష్టంగా ఉన్నాయి. ఓపెన్ కేటగిరిలో గతేడాది కటాఫ్ మార్కులు 487 ఉండగా, ఈ సంవత్సరం పెరిగే అవకాశం ఉంది' అని నారాయణ విద్యాసంస్థల డీజీఎం జాగర్లమూడి రవిశంకర్ తెలిపారు. 'వృక్ష, జంతుశాస్త్రాల ప్రశ్నలన్నీ ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకం నుంచే వచ్చాయి. రసాయనశాస్త్రంలో 23 ప్రశ్నలు, భౌతికశాస్త్రంలో కొన్ని ప్రాబ్లమ్స్ క్లిష్టంగా ఉన్నాయి' అని శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ ఛైర్మన్ వెనిగళ్ల నరేంద్రబాబు వివరించారు. 'వృక్ష, జంతుశాస్త్రాల ప్రశ్నలు మధ్యస్థంగా ఉన్నా ఎక్కువ సమయం తీసుకునేలా, ఎక్కువ ప్రశ్నలు జతచేసేలా ఉన్నాయి. రసాయనశాస్త్రంతోపాటు ఆర్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీ ప్రశ్నలు మధ్యస్థంగా, కెమిస్ట్రీలో ఇన్ ఆర్గానిక్‌వి సులభంగా ఉన్నాయి. భౌతికశాస్త్రంలో ప్రశ్నలు మధ్యస్థంగా ఉన్నాయి. ఎక్కువ ప్రశ్నలు జతపరిచేలా, సమస్య ఆధారితంగా ఉన్నాయి' అని శారదా విద్యాసంస్థల జీఎం జి.వి.రావు పేర్కొన్నారు.

551 నగరాల్లో నీట్ యూజీ దిల్లీ: వైద్య విద్యాసంస్థల్లో ప్రవేశాలకోసం ఉద్దేశించిన 'జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష' (నీట్ అండర్ గ్రాడ్యుయేషన్.. యూజీ)ను దేశంలో 551 నగరాల్లో, ప్రపంచవ్యాప్తంగా 14 దేశాల్లో ఆదివారం నిర్వహించారు.

# యశోదాదేవి 'ఆనంద' పరవశం!

హైదరాబాద్: తనయుడు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తే ఏ తల్లి మనసైనా ఉప్పొంగిపోతుంది. 92 ఏళ్ల యశోదాదేవి ఇప్పుడు అదే పారవశ్యంలో ఉన్నారు. ఆమె కుమారుడు చామరాజ వెంకట ఆనంద్ తెలంగాణ డీజీపీగా నియమితులైన విషయం తెలిసి ఆమె సంబరపడిపోయారు. ఈ ఉద్విగ్న క్షణాలను నూతన డీజీపీ సీవీ ఆనంద్ ఆదివారం సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం కుంట్లూరుకు చెందిన యశోదాదేవి పాఠశాలకు వెళ్లలేకపోయినా తన తనయులకు ఆంగ్ల విద్య ప్రాముఖ్యాన్ని ఆనాడే ఊహించారు. పిల్లల చదువు కోసం 1959లో హైదరాబాద్‌కు మకాం మార్చి, ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో చేర్పించారు. ఆమె ప్రోత్సాహంతో క్రికెట్, చదువులో దూసుకెళ్లిన సీవీ ఆనంద్ 1990లో తొలి ప్రయత్నంలోనే ఐపీఎస్ సాధించారు. 2021లోనే డీజీపీ హోదా పొందినా.. తెలంగాణ పోలీస్‌శాఖకు హెచ్‌వోపీఎఫ్‌గా నియమితులయ్యేందుకు ఐదేళ్లు వేచి చూశారు. తాజాగా ఈ నెల 1న డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన తన తల్లిని కలిశారు. 'అమ్మ ఆశీర్వాదం తీసుకున్నాను. ఆమె నవంబరు జనవరి నెలల్లో తీవ్ర అనారోగ్యంతో ఉన్నారు. ఇప్పుడూ మంచానికే పరిమితమైనప్పటికీ బాగానే కోలుకున్నారు. తన కుమారుడు ఈ రాష్ట్రానికి డీజీపీ కావాలన్న ప్రగాఢమైన కోరికే ఆమెను నిలబెట్టిందని నాకు అనిపించింది. అమ్మను కలవగానే ఇద్దరం ఎంతో సంతోషించాం' అని సీవీ ఆనంద్ తన ఆనందాన్ని పంచుకున్నారు.

# ఫలితాలకు వేళాయె

దిల్లీ: కాళ్లకు చక్రాలు కట్టుకుని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన విస్తృత ప్రచారం ఎంత మేరకు ఫలిస్తుంది.. కేంద్రంలోని అధికార కూటమిపై విపక్షాలు ఎక్కుపెట్టిన అస్త్రాలు ఏ మేరకు విజయవంతమయ్యాయి.. దేశంలో భిన్న ప్రాంతాల్లో ఓటర్ల మనోగతం ఎలా ఉంది.. అనేది సోమవారం తేలిపోనుంది. హోరాహోరీగా సాగిన శాసనసభ ఎన్నికల సమరంపై ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఎంతవరకు నిజమవుతాయనేదీ కొన్ని గంటల్లో తేటతెల్లం కానుంది. పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, తమిళనాడు రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో గత నెల జరిగిన శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం 8 గంటలకు మొదలుకానుంది. ఇవి కొన్ని రాష్ట్రాలకే పరిమితమైనా రాజకీయ పరిణామాల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేకెత్తిస్తున్నాయి. ఇప్పటికే సన్నాహక కౌంటింగ్ కసరత్తును పూర్తి చేయడంతోపాటు ఎలాంటి అవకతవకలు, ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా యంత్రాంగం జాగ్రత్తలు తీసుకుంది. ఆయా కేంద్రాల్లోకి అనధికారిక వ్యక్తులెవరూ అడుగుపెట్టడానికి వీల్లేకుండా ఎన్నికల సంఘం ఈసారి క్యూఆర్ కోడ్ ఆధారిత ఐడీ కార్డుల పద్ధతిని ప్రవేశపెట్టింది.

**బిర్యానీ.. మిఠాయిలకు ఆర్డర్లు**

ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో ఆయా పార్టీలు గెలుపు తమదేననే ధీమాలో ఉన్నాయి. విందులు, సాంస్కృతిక కార్యక్రమాలకూ ఏర్పాట్లు చేస్తున్నాయి. పశ్చిమబెంగాల్‌లో మోదీశ్రీ (కాషాయ రంగుతో), జొయ్ బంగ్లా (తృణమూల్ చిహ్నంలో ఒకటైన ఆకుపచ్చ రంగుతో) పేరిట రకరకాల మిఠాయిలు సిద్ధమవుతున్నాయి. రసగుల్లా, రాజ్‌భోగ్‌లను ఆయా రంగుల్లో సిద్ధం చేయడంలో తామంతా తలమునకలైనట్లు తయారీదారులు చెప్పారు. ముందుగా తెల్లని రసగుల్లాలు సిద్ధం చేస్తున్నామని, ఏ పార్టీ నెగ్గితే ఆ పార్టీకి తగ్గ రంగులో వాటిని ముంచి ఇస్తామని వివరించారు. కేరళలో కొన్నిచోట్ల అభ్యర్థులు వేలమందికి బిర్యానీ తయారు చేయించడంలో తలమునకలయ్యారు. కొచ్చిలో వేడుకలకు భాజపా సన్నద్ధమవుతోంది. పార్టీ నేతలు వందల లడ్డూలను ఆర్డర్ చేశారు.

ఒక స్థానంలో రీపోలింగ్ జరగాల్సి ఉండటంతో పశ్చిమ బెంగాల్‌లో మిగిలిన 293 అసెంబ్లీ స్థానాల్లో ఓట్ల లెక్కింపునకు 77 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటంతో 10 కేంద్రాలను తగ్గించడంతోపాటు అనూహ్య రీతిలో భద్రతా బలగాలను మోహరించారు. ఈవీఎంలను తారుమారు చేస్తారంటూ తృణమూల్ అగ్రనేతలు అనుమానాలు వ్యక్తంచేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఎన్నికల సంఘం 165 మంది అదనపు లెక్కింపు పర్యవేక్షకుల్ని, 77 మంది పోలీసు పర్యవేక్షకుల్ని నియమించింది. ఆదివారం భవానీపుర్ స్థానంలో ఓట్ల లెక్కింపు కేంద్రంవద్ద భాజపా, తృణమూల్ శ్రేణులు ఘర్షణపడ్డాయి. ఉత్తర 24 పరగణాల జిల్లాలో భాజపా నేత నివాసంపై కాల్పులు జరిపారనే అనుమానంతో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

* **అస్సాంలో హ్యాట్రిక్‌పై కమలనాథుల ఆశలు**

ఈసారీ అస్సాంలో విజయం సాధించి హ్యాట్రిక్ కొడతామని కమలనాథులు ఆశలు పెట్టుకున్నారు.

**కేరళలో అంచనాలు ఆసక్తికరం**

ప్రస్తుతం దేశంలో వామపక్ష కూటమి చేతిలో ఉన్న ఏకైక రాష్ట్రమైన కేరళ ఈసారి 'హస్త'గతం అవుతుందని, ఎల్‌డీఎఫ్ బదులు యూడీఎఫ్‌కి అధికారం దక్కుతుందని అత్యధిక ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ఇదే నిజమైతే కమ్యూనిస్టులకు 1960 తర్వాత ఒక్క రాష్ట్రంలోనూ అధికారం లేని పరిస్థితి తొలిసారి ఏర్పడనుంది. ఈ రాష్ట్రంలో కాలుమోపడంపై భాజపాలోనూ ఆశలున్నాయి. భాజపా నేత పి.సి.జార్జి (పూంజర్ స్థానం) తన విజయంపై ఎవరికైనా సందేహం ఉంటే రూ.కోటి పందెం వేసేందుకు ముందుకు రావాలని సవాల్ విసిరారు. సర్వీసు ఓటర్ల పోస్టల్ బ్యాలెట్లను చేర్చడంతో కేరళలో పోలింగ్ 79.70 శాతానికి చేరిందని ప్రధాన ఎన్నికల అధికారి రతన్ కేల్కర్ వెల్లడించారు.

**తమిళనాట రసవత్తరం**

వరసగా రెండోసారి తామే అధికారంలోకి వస్తామని ఎగ్జిట్ పోల్స్ చెప్పడంతో తమిళనాడులో డీఎంకే శిబిరంలో ఉత్సాహం ఉరకలెత్తుతోంది. నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ కొలువుదీరడం ఖాయమని కొన్ని సర్వేలు చెప్పడంతో తమిళ ఓటర్ల తీర్పు ఆసక్తికరంగా మారింది. 62 చోట్ల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. గోవా, కర్ణాటక, నాగాలాండ్, గుజరాత్, మహారాష్ట్రల్లో ఉప ఎన్నికలు జరిగిన 8 స్థానాల్లోనూ ఓట్ల లెక్కింపు సోమవారమే చేపట్టనున్నారు.

# నగల దుకాణంలో కాల్పుల కలకలం

మే 3 : కరీంనగర్ పట్టణంలో ఓ జ్యువెల్లరీ దుకాణంలో భారీ దొంగతనం జరిగింది. ఈరోజు ఉదయం 10 గంటలకు దుకాణంలోకి ప్రవేశించిన దుండగులు కాల్పులు జరిపి ఈ దొంగతనానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నగరంలోని పీఎంజీ జ్యువెల్లరీ దుకాణంలోకి తుపాకులతో ఆరుగురు దుండగులు ప్రవేశించారు. జ్యువెల్లరీ దుకాణం వద్ద ఉన్న భద్రతా సిబ్బంది వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. దీంతో ఆ దుండగులు సిబ్బందిపై 30 రౌండ్ల పాటు కాల్పులు జరిపారు. మిగతా సిబ్బందిని కట్టేసి వెళ్లిపోయారు. ఈ కాల్పుల్లో ముగ్గురికి గాయాలు కాగా, వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని హైదరాబాద్‌కు తరలించారు. సమాచారం తెలియగానే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# విదేశీ ప్రయాణాలపై పశ్చిమాసియా సెగ

మే 3 : పశ్చిమాసియాలో నెలకొన్న రాజకీయ సంక్షోభం భారత విమానయాన రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీని ఫలితంగా, ఈ ఏడాది మార్చిలో భారత్ నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు గణనీయంగా తగ్గాయి. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (AAI) విడుదల చేసిన నివేదిక ప్రకారం గత నెలల వృద్ధితో పోలిస్తే మార్చిలో విదేశాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య 18.5 శాతం మేర క్షీణించింది. మొత్తం అంతర్జాతీయ విమాన రాకపోకల్లో 21.3 శాతం తగ్గుదల నమోదైంది. పశ్చిమాసియాలో అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా పలు దేశాలు తమ గగనతలాలను మూసివేశాయి. దీంతో దుబాయ్, ఖతార్ వంటి ప్రధాన రవాణా కేంద్రాలకు విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఐరోపా, అమెరికా వెళ్లే విమానాలు సుదీర్ఘ మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోంది. దీనికి తోడు, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ATF) ధరలు గతేడాదితో పోలిస్తే 34 శాతం పెరిగాయి. ఈ పరిణామాలతో విమానయాన సంస్థలకు నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగాయి. ఈ నేపథ్యంలోనే పలు అంతర్జాతీయ సర్వీసులను తగ్గించుకుంటున్నట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది. పెరిగిన ఇంధన ధరలు, గగనతలాల మూసివేత కారణంగా చాలా అంతర్జాతీయ సర్వీసులు నష్టదాయకంగా మారాయని ఎయిర్ ఇండియా సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ తెలిపారు. ఈ కారణంగా మే నుంచి జులై వరకు సుమారు 12 శాతం లాంగ్ హాల్ విమానాలను తగ్గించనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రయాణికులకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నామని, పరిస్థితి చక్కబడగానే సర్వీసులను పునరుద్ధరిస్తామని ఆయన పేర్కొన్నారు.

# మూడంచెల ప్రణాళిక

దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధం ముగింపు దిశగా దౌత్య ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా అమెరికాకు పాకిస్థాన్‌ద్వారా ఇరాన్ ఓ నూతన ప్రణాళికను సమర్పించింది. ఇది సజావుగా అమలైతే 30 రోజుల్లో యుద్ధం ముగుస్తుంది. 14 పాయింట్ల ఈ ప్రణాళికలో మొత్తం మూడంచెలు ఉంటాయి. తొలి అంచెలో హర్మూజ్ జలసంధిని క్రమంగా తెరుస్తారు. ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని అమెరికా ఎత్తివేస్తుంది. అదే సమయంలో సముద్రంలో మందుపాతరల తొలగింపు ప్రక్రియ టెహ్రాన్ నేతృత్వంలో జరుగుతుంది. రెండో అంచెలో నిర్దిష్ట కాల పరిమితి తర్వాత యురేనియం శుద్ధిని (3.6% వరకే) ఇరాన్ తిరిగి ప్రారంభిస్తుంది. అది తమ గడ్డపై అణు మౌలిక వసతుల ధ్వంసానికి అంగీకరించదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేయకూడదు. టెహ్రాన్ దాడులకు దిగకూడదు. జప్తు చేసిన టెహ్రాన్ ఆస్తులను విడుదల చేయాలి. చివరిదైన మూడో అంచెలో పొరుగున ఉన్న అరబ్ దేశాలతో టెహ్రాన్ వ్యూహాత్మక చర్చలు జరుపుతుంది. పశ్చిమాసియా ప్రాంతీయ భద్రతకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడంపై దృష్టి పెడతారు. భవిష్యత్తులో మళ్లీ దాడులకు దిగబోమని ఇరాన్‌కు అమెరికా హామీ ఇవ్వడం వంటి అంశాలూ కొత్త ప్రణాళికలో ఉన్నాయి. వాషింగ్టన్ ప్రతిపాదించిన 9 పాయింట్ల ప్రణాళికకు ప్రతిగా టెహ్రాన్ దీన్ని రూపొందించింది.

**భారీ ట్యాంకర్‌పై దాడి**

హర్మూజ్ సమీపంలో ఓ భారీ ట్యాంకర్‌పై ఆదివారం చిన్న బోట్లు దాడి చేశాయని బ్రిటన్ సైన్యానికి చెందిన యునైటెడ్ కింగ్డమ్ మారిటైం ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ తెలిపింది. సిరిక్ (ఇరాన్) తీరంలో ఈ ఘటన చోటుచేసుకుందని వెల్లడించింది. అయితే ట్యాంకర్‌లోని సిబ్బంది అంతా సురక్షితంగానే ఉన్నారని పేర్కొంది. దాడి ఎవరు చేశారనేది తెలియరాలేదు.

**వేరే నౌకలు వెళ్లొచ్చు: ఇరాన్**

హర్మూజ్‌పై తమ నియంత్రణ కొనసాగుతోందని ఇరాన్ అధికారులు పునరుద్ఘాటించారు. అమెరికా, ఇజ్రాయెల్‌లకు చెందినవి మినహా ఇతర దేశాల నౌకలు తమకు టోల్ చెల్లించి.. ఈ జలసంధిలో ప్రయాణించొచ్చని పేర్కొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఇటీవల నిర్వహించిన ఆర్టీసీ కార్మికుల సమ్మెలో ప్రాణాలు ప్రాణాలు కోల్పోయిన నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ కోలా శంకర్ గౌడ్ కుటుంబాన్ని ఇల్లందు డిపో ఉద్యోగులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.26 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్మికుని కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం కార్మికుని కుటుంబానికి సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిపో ఇంచార్జ్ సునీత, సిస్టమ్ సూపర్‌వైజర్ వేమూరి నాగరాజు, డ్రైవర్ ఇమ్మడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన జనగాం కలెక్టర్



జనగామ, ప్రజాస్ఫూర్తి : జనగాం జిల్లా లో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్షలు ప్రశాంత వాతావరణం లో జరిగాయని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. జిల్లా లోని ఏబీవీ డిగ్రీ కాలేజ్, పెంబర్తిలోని మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ పాఠశాల పరీక్షా కేంద్రాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, బయోమెట్రిక్ విధానాన్ని ఎలా అమలు చేస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు హాజరైన విద్యార్థుల సంఖ్య, గైర్హాజరు శాతం వంటి వివరాలను కూడా కలెక్టర్ సేకరించారు. పరీక్షలు పూర్త య్యేంతవరకు విద్యార్థులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఇన్విజిలేటర్లు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్నతో పాటు పోలీస్ అధికారులు, నీట్ మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అడవి పందుల దాడిలో వరి పంట ధ్వసం



ప్రజాస్ఫూర్తి, జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తపాలాపూర్ గ్రామ సమీపంలో శనివారం రాత్రి అడవి పందులు బీభత్సం సృష్టించాయి. రైతు జెల్ల భీమయ్యకు చెందిన వరి పంటను పూర్తిగా ధ్వంసం చేశాయి. చేతికొచ్చిన వరి పంటను అడవి పందుల గుంపు దాడి చేసి సుమారు రెండు ఎకరాల వరకు పనికిరాకుండా చేశాయని బాధిత రైతు జెల్ల భీమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఒక్కరాత్రిలో నాశనమైందని వాపోయారు. ఈ ఘటనపై అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి, పంట నష్టాన్ని అంచనా వేసి తగిన నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతు కోరారు. గతంలో కూడా ఈ ప్రాంతంలో అడవి పందుల బెడద ఉందని, అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామ రైతులు విజ్ఞప్తి చేశారు.

## కొత్తూరుపల్లెలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, జన్నారం : జన్నారం మండలం కొత్తూరుపల్లె గ్రామంలో నూతన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్నిదేవునిగూడ సర్పంచ్ రామటెంకి రాజేష్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఈ గ్రామంలో కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడేవారని అన్నారు. రైతులంతా కలిసి 'సదాశివ రైతు మ్యాక్స్' పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకొని, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సహకారంతో మొట్టమొదటిసారిగా ఈ సంవత్సరం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇక నుంచి ఈ ప్రాంత రైతులు పండించిన ధాన్యాన్ని ఈ కేంద్రం ద్వారానే కొనుగోలు చేస్తారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మోహన్ రెడ్డి, దేవునిగూడ ఉపసర్పంచ్ కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎంబడి చంద్రమౌళి, వార్డు మెంబర్ ఎంబడి పోశన్న, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బాలుడి చేతిలో పేలిన బ్యాటరీ.. తెగిన వేళ్లు

శివ్వంపేట: మెదక్ జిల్లా శివ్వంపేటలో బాలుడి చేతిలో బ్యాటరీ పేలింది. పేలుడు ధాటికి బాలుడి వేళ్లు తెగిపడ్డాయి. వెంటనే కుటుంబసభ్యులు అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థి శివతేజ్ బ్యాటరీతో ఆడుకుంటుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.



# శ్రీ రామకృష్ణ విద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో స్థానిక కిరాణా వర్తక సంఘం భవనం నందు 20సంవత్సరముల తర్వాత శ్రీ రామకృష్ణ విద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తాము విద్యనభ్యసించిన గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. తాము చదువుకున్న రోజులను, తాము చేసిన అల్లరి నెమ్మరు వేసుకున్నారు. ముందుగా ఈ కార్యక్రమంలో పరిచయ కార్యక్రమాలు అనంతరం, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు విద్యార్థులు సన్మానించి, చిన్న జ్ఞాపకార్థంగా బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండుజు దేవేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి మమ్మల్ని గుర్తు ఉంచుకొని ఈ కార్యక్రమానికి ఆహ్వానించడం చాలా ఆనందంగా ఉంది. అలాగే మీరు చిన్ననాటి నుంచి మంచిగా చదివి ఈ స్థాయిలో ఉన్నారు అంటే మన పాఠశాల కృషి అని, ఉపాధ్యాయుల సహకారం ఉంటే విద్యార్థులు ఏ స్థాయిలో అయినా చేరుకోగలరు అని మీరు నిరూపించారు. మిమ్మల్ని చూస్తుంటే మాకు మీరు బాల్యంలో చేసిన అల్లరి పనులు గుర్తుకొస్తున్నాయి. అని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ పూర్వ సమ్మేలానికి ముందుండి నడిపిన గుగులోతు రాజశేఖర్, వల్లాల ప్రశాంత్, స్రవంతి, అభినవ్ ని తోటి విద్యార్థులు ఈ కార్యక్రమం విజయవంతం చేసిన సందర్భంగా ఘనంగా శాలువాతో సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండోజు దేవేందర్, ఉపాధ్యాయులు కృష్ణమాచారి, శేఖర్, లక్ష్మణ్, కమల, సంధ్యారాణి, విధులత, గుండోజు సురేందర్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## త్వరలోనే రెండో విడత 'ఇందిరమ్మ' ఇళ్ల మంజూరు

* **కూసుమంచి ప్రజా దర్బార్‌లో మంత్రి పొంగులేటి భరోసా**



కూసుమంచి, ప్రజాస్ఫూర్తి: ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, అధికారులే నేరుగా ప్రజల వద్దకు వచ్చి అర్జీలు స్వీకరించి పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రజా దర్బార్ ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పారదర్శక పాలనను ప్రజల గడప వద్దకే తీసుకెళ్తున్నామని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా తక్షణ చర్యలు చేపడుతున్నామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని క్లస్టర్లుగా విభజించి నిర్వహిస్తున్న ఈ ప్రజా దర్బార్లలో అందిన ప్రతి న్యాయబద్ధమైన దరఖాస్తును రాజకీయ పార్టీలకు అతీతంగా పరిష్కరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. సాదా బైనామా, నిషేధిత జాబితా, భూమి రికార్డుల వంటి దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నవాబుపేటలో నేడు రైతు అవగాహన సదస్సులు


నవాబుపేట, ప్రజాస్ఫూర్తి : నవాబుపేట మండలంలోని రైతువేదికల వద్ద రైతుల అవగాహన సదస్సులను ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక, 99 రోజుల ప్రణాళికలో భాగంగ నిర్వహిస్తున్నట్లు మండలం వ్యవసాయ శాఖ అధికారిణి జ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని నవాబుపేట్, చించల్ పేట్, పుల్మామిడి, ఎల్లకొండ, మినపల్లి కలాన్ లలోని రైతు వేదికల వద్ద సోమవారం ఉదయం 8.30 గంటలకు కార్యక్రమం



ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నేల ఆరోగ్య పరిరక్షణ సమతుల ఎరువులవినియోగం, సహజ వ్యవసాయం, నాణ్యమైన విత్తనాల వినియోగం, పంట ఋణాలు వ్యవసాయ యాంత్రికరణ వంటి అంశాలపై రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో అవగాహన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాపతినిధులు, అధికారులు వార్డుమెంబర్లు, రైతులు పాల్గొనాలని కోరారు.

## గాలి దుమారం ప్రభావం తక్షణమే స్పందించిన పోలీసులు

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ పట్టణం లోని కేసముద్రం రోడ్, బస్ డిపో ఎదురుగా ఉన్న ప్రాంతంలో అకస్మాత్తుగా వచ్చిన గాలిదుమారం తీవ్ర ప్రభావం చూపింది. బలమైన గాలుల పలు దుకాణాల పైకప్పు రేకులు, కర్రలు ఎగిరిపడి రోడ్డుమీద పడటంతో రహదారి పూర్తిగా మూసుకుపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అంచనా వేసి తక్షణమే సహాయక చర్యలు చేపట్టారు. రోడ్డుమీద పడిపోయిన రేకులు, కర్రలను తొలగిస్తూ మార్గాన్ని శుభ్రపరచి ట్రాఫిక్‌ను సజావుగా పునరుద్ధరించారు. ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా అప్రమత్తం





చేస్తూ భద్రతా చర్యలు తీసుకున్నారు. ఈ సహాయక చర్యల్లో పాల్గొన్న సీఐ అంజలి, ట్రాఫిక్ ఎస్సై అరుణ్, టౌన్ ఎస్సై షకీర్ మరియు సిబ్బంది చూపిన సేవాభావం, కర్తవ్యనిబద్ధత, మానవతా దృక్పథం ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ డా. పి. శబరీష్ అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించి ప్రజలకు అండగా నిలవడం పోలీసుల ప్రధాన బాధ్యత అని ఆయన తెలిపారు.

## రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఎండలు

* **పలుచోట్ల మోస్తరు నుండి ఉరుములు, మెరుపులతో భారీ వర్షా లు**
* **నిజామాబాద్ జిల్లా మెండోరలో 46 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత**
* **నిప్పల కొలిమిలా తెలంగాణ**

తెలంగాణ బ్యూరో: రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలకు జనం విలవిలలాడుతున్నారు. గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతూ, రికార్డులను తిరగరాస్తున్నాయి. ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వేడి తీవ్రత అత్యధికంగా ఉంటోంది. నిజామాబాద్ జిల్లా మెండోరలో అత్యధికంగా 46 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదై ఈ వేసవిలోనే రికార్డు సృష్టించింది. రాష్ట్రంలోని పలు ఇతర ప్రాంతాల్లో కూడా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటాయి. ఉదయం 10 గంటల నుండే ఎండ తీవ్రత




మొదలవుతుండటంతో రహదారులన్నీ జనసంచారం లేక వెలవెలబోతున్నాయి. నల్గొండ జిల్లా అనుములలో 45.9, నిర్మల్ జిల్లా ఖానాపూర్ లో 45.9, సిద్దిపేట్ జిల్లా తొగుట లో 45.9, ఆదిలాబాద్ జిల్లా ఆదిలాబాద్ అర్బన్ లో 45.8, పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ లో 45.8, కామారెడ్డి జిల్లా కొల్లూరులో 45.7, కుమరం భీం జిల్లా తిర్యాణిలో 45.7, జగిత్యాల జిల్లా రాఘవపేటలో 45.6, ఖమ్మం జిల్లా కొజిజెర్లలో 45.6, సూర్యాపేట జిల్లా గరిడెపల్లిలో 45.5, మంచిర్యాల జిల్లా భీమారంలో 45.1, కరీంనగర్ జిల్లా మానకొండూర్ లో 44.6 డిగ్రీ సెల్సియస్ ల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తీవ్రమైన ఎండల దృష్ట్యా మధ్యాహ్నం సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండటానికి తగినన్ని నీళ్లు, ద్రవ పదార్థాలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. రాబోయే రెండు, మూడు రోజుల్లో ఎండ తీవ్రత కొనసాగుతూనే అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది.

## డీఎస్పీగా పదోన్నతి పొందిన సిఐ గట్ల మహేందర్ రెడ్డి




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ పట్టణ సీఐ గట్ల మహేందర్ రెడ్డికి డీఎస్పీగా పదోన్నతి లభించిన సందర్భంగా శనివారం మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా.శబరీష్, ఐపీఎస్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తన విధి నిర్వహణలో అందించిన మార్గదర్శకానికి ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేసారు. ఎస్పీ డా. శబరిష్ మాట్లాడుతూ సీఐ మహేందర్ రెడ్డి ని అభినందిస్తూ, కొత్త బాధ్యతల్లో మరింత ప్రతిభ కనబరిచి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖలో క్రమశిక్షణ, సేవాభావం, ప్రజల పట్ల బాధ్యతతో పనిచేస్తూ ఉన్నత స్థానాలను అధిరోహించడం ప్రతి పోలీస్ అధికారి లక్ష్యంగా ఉండాలని ఈ సందర్భంగా ఎస్పీ కొనియాడారు.

## అక్రమ ఇసుక తరలిస్తున్న వాహనాలు సీజ్

ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఐదు లారీలు, ఒక జేసిబీను కొత్తగూడెం జిల్లా పోలీసులు ఆదివారం సీజ్ చేశారు. పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు లారీలను, దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక లారీ, బూర్గంపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు లారీలు, ఒక జెసిబీను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఈ సందర్భంగా హెచ్చరించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సంబంధిత శాఖాధికారులతో సమన్వయం పాటిస్తూ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పట్టుబడిన ఇసుక అక్రమ రవాణాదారులపై కేసులు నమోదు చేశామన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేస్తాః మదార్


ప్రజాస్ఫూర్తి, పాలకుర్తిః తనపై నమ్మకంతో జనగాం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వంకు



మాజీ జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఎండి మదార్ దన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి ని ఆయన మర్యాదపూర్వకంగ కలిశారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు. జిల్లా ప్రధానకార్యదర్శగా పాలకుర్తి నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా తాను కృషి చేస్తానని మదార్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే కాకుండా అర్హులైన వారికి అందేలా చూస్తానన్నారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ముందుంటానని స్పష్టం చేశారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి సహకారంతో తనకు ఈ పదవిదక్కిందని అన్నారు.

## కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించిన ప్రభుత్వ కళాశాల విద్యార్థిని

ప్రజాస్ఫూర్తి, జన్నారంః హైదరాబాద్‌లో జరిగిన కరాటే పోటీల్లో జన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎండి.అస్మా అత్యుత్తమ



ప్రతిభ కనబరిచింది. శనివారం నగరంలో జరిగిన పోటీలలో ఎండి అస్మా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్ అందుకుంది. కళాశాలలో సదరు విద్యార్థిని ప్రథమ సంవత్సరం సీఈసీ గ్రూప్ చదువుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజిత్ కుమార్ తెలిపారు. కళాశాలకు, జన్నారం ప్రాంతానికి అస్మా మంచి పేరు తీసుకొచ్చిందని అయన హర్షం వ్యక్తం చేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఎం.విజిత్ కుమార్, బాబురావు, సాయికుమార్, రవీందర్, నాగేశ్వర, మోహన్, దేవేందర్, శశికళ, స్వరూప, కరుణాకర్, కుమారస్వామి, శివరాం విద్యార్థినిని అభినందించారు.



# ఓట్ల లెక్కింపునకు బెంగాల్ సిద్ధం.. ఆ 11 జిల్లాల్లో హై అలర్ట్

దిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో సోమవారం ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉన్నత స్థాయి భద్రతా సమీక్షా సమావేశం నిర్వహించింది. ఎన్నికల ఫలితాల సమయంలో హింస చెలరేగే అవకాశమున్న 11 జిల్లాలను అత్యంత సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించింది. ఆయా జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించి.. భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు వెల్లడించింది. ఈ జాబితాలో ముర్షిదాబాద్, ఉత్తర 24 పరగణాలు, దక్షిణ 24 పరగణాలు, కూచ్ బెహార్, మాల్దా, నాడియా, బీర్‌భూం, పశ్చిమ మేదినీపూర్, హుగ్లీ వంటి జిల్లాలున్నాయి. ఫలితాలు వెలువడే సమయంలో ఎటువంటి హింస, అల్లర్లు జరగకుండా ఉండేందుకు అన్ని కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలను హై అలర్ట్‌లో ఉంచినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 75వేల మంది కేంద్ర పారామిలిటరీ దళాలను మోహరించినట్లు కేంద్ర హోంశాఖ అధికారులు పేర్కొన్నారు. బుల్లెట్లు, పేలుళ్లను తట్టుకోగల అధునాతన 'మార్క్సమ్యాన్' సాయుధ వాహనాలను రంగంలోకి దించారు. బంగ్లాదేశ్‌ను ఆనుకుని ఉన్న సరిహద్దు జిల్లాల్లో అదనపు నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే కంటెంట్‌ను వ్యాప్తి చేయకుండా అడ్డుకునేందుకు రాజకీయ పార్టీల సోషల్ మీడియా అకౌంట్లు, వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని పలు ముఖ్యమైన ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఎన్ఐఏ అధికారులు నిఘా ఉంచారు. అధికారిక వర్గాల ప్రకారం.. 2011 ఎన్నికల సమయంలో 25మంది ప్రాణాలు కోల్పోయారు. 2016 ఎన్నికల్లో 30మంది మృతిచెందగా..2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అత్యధికంగా 58మంది మరణించారు. మళ్లీ అటువంటి హింస జరగకుండా నివారించేందుకు ఈ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు.

## రాష్ట్రపతికి ఫిర్యాదు చేయనున్న ఎంపీ రాఘవ్ చడ్డా

ఆమ్ ఆద్మీ పార్టీని వీడిన ఎంపీలను లక్ష్యం చేసుకోవడానికి ఆ పార్టీ పంజాబ్‌లో ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తోందని రాజ్యసభ ఎంపీ రాఘవ్ చడ్డా ఆరోపించారు. అవినీతిపరులు, రాజీపడిన వారి చేతుల్లోకి ఆ పార్టీ వెళ్లిపోవడం వల్లే తాము బయటకు రావాల్సి వచ్చిందన్నారు. భాజపాలో చేరిన ఎంపీలపై తప్పుడు కేసులు పెట్టడానికి ఆప్ ప్రయత్నిస్తోందని..అందులో భాగంగానే ఎంపీ సందీప్



పాఠక్ పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారని అన్నారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్లేందుకు అపాయింట్‌మెంట్ కోరినట్లు తెలిపారు. మే 5న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తో సమావేశం కానున్నట్లు చడ్డా తెలిపారు. ఆయనతో పాటు మరో ముగ్గురు ఎంపీలు కూడా సమావేశంలో పాల్గొనే అవకాశం ఉంది. కాగా తమ పార్టీని వీడిన ఏడుగురు ఎంపీలు భాజపాలో విలీనమవ్వడాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దృష్టికి తీసుకువెళ్తానని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ ఇటీవల పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో చడ్డా రాష్ట్రపతిని కలవనుండడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## జీవిత భాగస్వామి ఆదాయం.. RTI కింద ఆ వివరాలు పొందలేరు: దిల్లీ హైకోర్టు

సమాచార హక్కు చట్టం (RTI) కింద ఒక వ్యక్తి తన జీవిత భాగస్వామి ఆదాయ వివరాలు పొందలేరని దిల్లీ హైకోర్టు ఓ కేసులో తీర్పు చెప్పింది. ప్రజాప్రయోజనాలకు సంబంధించిన అంశం అయితే తప్ప.. ఈ చట్టంలోని సెక్షన్ 8(1)(జే) కింద వ్యక్తిగత సమాచార వెల్లడికి మినహాయింపు ఉందని పేర్కొంది. గతంలో సుప్రీం కోర్టు వెలువరించిన ఓ తీర్పు ప్రకారం.. ఒక వ్యక్తి ఆదాయపు పన్ను రిటర్న్‌లు కూడా దీని కిందికే వస్తాయని జస్టిస్ పురుషైంద్ర కుమార్ కౌరవ్ స్పష్టం చేశారు. భర్తకు దూరంగా ఉంటున్న ఓ మహిళ.. పన్ను పరిధిలోకి వచ్చే అతని ఆదాయ వివరాలు వెల్లడించాలని కోరుతూ గతంలో ఆర్టీఐ కింద దరఖాస్తు చేశారు. ఈ వివరాలను బహిర్గతం చేయాలని ఐటీ అధికారులను 2021లో కేంద్ర సమాచార కమిషనర్ (సీఐసీ) ఆదేశించారు. సీఐసీ ఉత్తర్వులను సవాల్ చేస్తూ భర్త.. దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. భార్య కోరిన వివరాలు పిటిషనర్



వ్యక్తిగత సమాచారమని, అది ప్రజాప్రయోజనం కిందికి రానందున దానిని వెల్లడించాలని ఆదేశించలేమని పేర్కొంది. ఈ క్రమంలోనే సీఐసీ ఉత్తర్వులను పక్కన పెడుతూ ఇటీవల తీర్పు వెలువరించింది. ప్రభుత్వ అధికారుల పనితీరులో పారదర్శకతను తీసుకొచ్చేందుకు ఆర్టీఐ చట్టాన్ని రూపొందించారని హైకోర్టు పేర్కొంది. విస్తృత ప్రజానీకంతో సంబంధం లేని వ్యక్తిగత సమాచారం వెల్లడికి అనుమతించడం దాని ఉద్దేశం కాదని తెలిపింది. భరణం దావా పరిష్కారానికి భర్త ఆదాయ వివరాలు అవసరమని ఆమె వాదించినప్పటికీ.. దానికి ఇతర మార్గాలు అందుబాటులో ఉన్నాయని చెప్పింది. భరణం కేసుల్లో ఇరుపక్షాలూ తమ ఆదాయం, ఆస్తులు, అప్పులకు సంబంధించిన అఫిడవిట్‌లను దాఖలు చేయాలని చట్టం నిర్దేశిస్తోందని తెలిపింది.

## తమిళనాట డీఎంకేను మళ్లీ విజయం వరిస్తుందా?


తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కూటమి మరోసారి అధికారంలోకి రావొచ్చని మెజారిటీ సర్వే సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. అన్నాడీఎంకే, భాజపా కూటమికి భంగపాటు తప్పదని పేర్కొన్నాయి. ఒకట్రెండు సర్వేలు మాత్రం కాస్త భిన్నంగా అంచనాలను ప్రకటించాయి. డీఎంకేతో సమానంగా విజయ్ పార్టీ టీవీకేకు సీట్లు రావొచ్చని యాక్సిస్ మై ఇండియా సర్వే సంస్థ అభిప్రాయపడగా.. అన్నాడీఎంకే కంటే ఎక్కువ స్థానాలు సాధించొచ్చని టుడేస్ చాణక్య పేర్కొంది.



ఒకవేళ ఏ పార్టీకీ మెజారిటీ స్థానాలు రానప్పుడు విజయ్ కీలకం కానున్నారు. ఈ ఉత్కంఠకు మరికొన్ని గంటల్లో తెరపడనుంది.

## సొంత వాహనాన్నే అంబులెన్సుగా మార్చి.. పదుల సంఖ్యలో ప్రాణాలు కాపాడి!

రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సరైన సమయానికి అంబులెన్స్ రాక ప్రాణాలు కోల్పోయినవారెందరో. రాజస్థాన్ రాజధాని జైపుర్‌కు చెందిన టాక్స్ కన్సల్టెంట్ సందీప్ గుప్తా సైతం ఇటువంటి ఓ ఘటనే చూశాడు. దాదాపు 22 ఏళ్ల క్రితం యాక్సిడెంట్‌లో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా.. అంబులెన్స్ కోసం ఎదురుచూస్తుండగానే అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనతో చలించిపోయిన సందీప్.. క్షతగాత్రులను ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. తన కారునే అంబులెన్సుగా మార్చి.. ప్రమాద బాధితులను సకాలంలో ఆస్పత్రికి తరలిస్తూ ప్రాణాలు కాపాడుతున్నారు. తన కారులో ప్రథమ చికిత్స సామగ్రి, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచారు. అత్యవసర సమయాల్లో ఉపయోగించేందుకు సైరన్ సైతం అమర్చుకున్నారు. తాను



ప్రయాణిస్తున్న దారిలో ఎవరైనా ప్రమాదానికి గురైతే వెంటనే వారిని ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఇలా ఇప్పటివరకు 120 మందికిపైగా క్షతగాత్రులను తన వాహనంలో తీసుకెళ్లారు. సకాలంలో చికిత్స అందడంతో పదుల సంఖ్యలో బాధితులకు ప్రాణాపాయం తప్పింది. ట్రాఫిక్ పోలీసులు సైతం తనకు సహకరిస్తారని సందీప్ తెలిపారు. మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్, ఉన్నతాధికారులు, వివిధ సంస్థల నుంచి ఆయన సేవలకు గుర్తింపు లభించింది.

## పశ్చిమ బెంగాల్‌లో గెలుపెవరిది?



పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితంపై ఉత్కంఠ నెలకొంది. 2011 నుంచి వరుసగా మూడుసార్లు విజయం సాధించిన తృణమూల్ కాంగ్రెస్ (TMC) అధినేత్రి మమతా బెనర్జీ మరోసారి అధికార పగ్గాలు చేపట్టొచ్చని కొన్ని ఎగ్జిట్ పోల్స్ సంస్థలు అంచనా వేశాయి. గత ఎన్నికల్లో 77 స్థానాలతో ప్రధాన ప్రతిపక్షంగా అవతరించిన భారతీయ జనతా పార్టీ (BJP) బెంగాల్‌లో అధికారంలోకి వస్తుందని మెజారిటీ సర్వేలు అభిప్రాయపడ్డాయి.

## అస్థిపంజరం ఘటన.. బ్యాంకు అధికారులను క్షమించిన బాధితుడు

ఒడిశాలో జీతూ ముండా అనే ఓ గిరిజనుడు తన సోదరి సమాధిని తవ్వి, ఆమె అస్థిపంజరాన్ని బ్యాంకుకు తీసుకెళ్లిన ఘటన ఇటీవల చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. తన అక్క ఖాతాలోని సొమ్మును విత్‌డ్రా చేసుకునే విషయంలో బ్యాంకు సిబ్బంది తీరుకు విసిగిపోయి ఈ చర్యకు పాల్పడ్డారు. అయితే, తనను ఇబ్బంది పెట్టారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుకోవడం లేదని తాజాగా ఆయన మీడియాకు తెలిపారు. వారు తనను ముప్పుతిప్పలు పెట్టారన్నది వాస్తవమేనని.. అయితే, సోదరి అవశేషాలు తీసుకెళ్లిన అనంతరం స్వయంగా ఇంటికే వచ్చి నగదు అందజేశారని చెప్పారు. సమస్య తీరిపోయాక అధికారులపై చర్యలు తీసుకోవడంలో అర్థమేముందని ప్రశ్నించారు. ఇటీవల తాను చేసిన పనికి సిగ్గుపడటం లేదని జీతూ స్పష్టం చేశారు. సోదరి అస్థిపంజరాన్ని బ్యాంకుకు



తీసుకెళ్లకపోయి ఉంటే.. ఆ డబ్బు ఇచ్చేవారే కాదని, ఈ వ్యవహారంలో తాను ఎటువంటి తప్పూ చేయలేదని చెప్పారు. సమాధి నుంచి అస్థిపంజరాన్ని తవ్వి తీసినందుకు కూడా ఎటువంటి పశ్చాత్తాపం లేదన్నారు. ''చనిపోయిన వ్యక్తి అవశేషాలను వెలికితీయడం తప్పని ప్రజలు అంటున్నారు. కానీ, నాకు వేరే మార్గమేదీ లేకపోయింది'' అని తెలిపారు. ఈ ఘటన అనంతరం ప్రజల నుంచి తనకు రూ.15 లక్షల వరకు ఆర్థిక సాయం అందిందని చెప్పారు. బ్యాంకు అధికారులు తన సోదరి ఖాతా నుంచి వడ్డీతో కలిపి రూ.19,402 చెల్లించారని, ఈ మొత్తాన్ని తమ కుటుంబంలో మూడు భాగాలుగా పంచుకున్నట్లు తెలిపారు.

## 'ఆధార్' కొత్త లుక్ వార్తలు నిరాధారం

దిల్లీ: ఆధార్ కార్డుపై ఇకమీదట పేర్లు, చిరునామా లేకుండా కేవలం ఫొటో, క్యూఆర్ కోడ్ మాత్రమే ఉంటాయంటూ జరుగుతున్న ప్రచారాన్ని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ ఖండించింది. ఈ వార్తలు నిరాధారమని, ప్రజలు ఎవ్వరూ నమ్మొద్దని పిలుపునిచ్చింది. అలాంటి కార్డు తీసుకొచ్చే ప్రతిపాదనేదీ లేదని ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఇలాంటి పోస్టులు ప్రజల్లో అనవసరమైన అయోమయాన్ని సృష్టిస్తున్నందున స్పష్టత




ఇస్తున్నట్లు పేర్కొంది. ప్రజలు యూఐడీఏఐ నుంచి వచ్చే అధికారిక ప్రకటనలు తప్పితే సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే ప్రచారాన్ని నమ్మొద్దని కోరింది.

## ఇరాన్ గగనతలంలో ఎక్కడికైనా చొచ్చుకెళ్లగలం: నెతన్యాహు

ఇజ్రాయెల్ తన ఆయుధ సంపత్తిని మరింత పెంచుకునేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే అమెరికా నుంచి మరో రెండు స్క్వాడ్రన్‌ల ఎఫ్35ఐ, ఎఫ్15ఐఏ యుద్ధ విమానాలను కొనుగోలు చేయనున్నట్లు రక్షణశాఖ ప్రకటించింది. సీనియర్ మంత్రులతో కూడిన కమిటీ ఈ కొనుగోళ్లకు ఆమోదముద్ర వేసిందని తెలిపింది. ఎఫ్35ఐలను లాక్‌హీడ్ మార్టిన్, ఎఫ్15ఐఏలను బోయింగ్ సంస్థలు



తయారు చేయనున్నాయి. ఈ ఒప్పందం తమ గగనతల ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అన్నారు. తమ పైలట్లు ఇరాన్ గగనతలంలో ఎక్కడికైనా చొచ్చుకెళ్లగలరని, అందుకు వారు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అదేవిధంగా దేశీయ రక్షణ తయారీ రంగాన్ని విస్తరిస్తామని చెప్పారు. రాబోయే దశాబ్దంలో తమ రక్షణ బడ్జెట్‌కు అదనంగా 350 బిలియన్ షెకెల్స్ (118 బిలియన్ డాలర్లు) కేటాయించాలని యోచిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా కొనుగోలు చేయనున్న యుద్ధ విమానాలు ప్రాంతీయ ముప్పులను ఎదుర్కొంటూ.. ఇజ్రాయెల్ గగనతల ఆధిపత్యాన్ని కాపాడుతూ.. ఐడీఎఫ్ దీర్ఘకాలిక అభివృద్ధికి మూలస్తంభంగా నిలుస్తాయని రక్షణశాఖ తెలిపింది. ప్రస్తుతం ఇజ్రాయెల్ వద్ద 48 ఎఫ్35ఐ ఫైటర్ జెట్లు ఉన్నాయి. ఈ తరహా మరో 25 యుద్ధవిమానాల కోసం 2023లో ఆర్డర్ చేసింది. 2024లో 25 ఎఫ్15ఐఏల కోసం ఆర్డర్ ఇవ్వగా.. 2031 నుంచి డెలివరీ ప్రారంభమవుతుందని అంచనా.

# సీఎం, మంత్రులు రోడ్లపై తిరగలేరు... రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

- ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని కేటీఆర్ ఆరోపణ
- సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఘాటైన బహిరంగ లేఖ
- జీవో 7ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్
- 10 వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా పథకానికి ఎసరు పెడుతున్నారని విమర్శ
- విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరిక

హైదరాబాద్, మే 3: తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై రాజకీయ దుమారం చెలరేగింది. ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘాటైన బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో 7ను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని అన్నారు. సీఎం, మంత్రులు రోడ్లపై తిరగలేరని ఆయన హెచ్చరించారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థను పూర్తిగా కుప్పకూల్చారని కేటీఆర్ తన లేఖలో తీవ్రస్థాయిలో విమర్శించారు. "ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 7 ముమ్మాటికీ ఫీజుల పథకానికి పాతరేసేందుకు చేస్తున్న కుటిల ఎత్తుగడ. దీనివల్ల 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుంది. ఇది నిరుపేద విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసే వెన్నుపోటు చర్య" అని కేటీఆర్ అభివర్ణించారు.




విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఈ జీవోను వెంటనే వెనక్కి తీసుకుని, విద్యార్థి లోకానికి క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా కొనసాగించిందని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ పథకానికి గ్రహణం పట్టిందని విమర్శించారు. గత రెండున్నరేళ్లుగా సుమారు 10 వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలను చెల్లించలేదని, ఇప్పుడు విద్యార్థుల ఖాతాల్లో నేరుగా డబ్బులు వేస్తామంటే ఎవరూ నమ్మరని కేటీఆర్ అన్నారు. బకాయిలు పేరుకుపోవడంతో 2500కు పైగా కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. నిధులు అడిగిన వారిని వన్‌టైమ్ సెటిల్మెంట్, టోకెన్ల పేరుతో మభ్యపెట్టారని, నిరసన తెలిపితే విజిలెన్స్ దాడులతో బెదిరించారని ఆరోపించారు. ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే గురుకులాల్లో 142 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని, ఇప్పటికీ వేలాది మంది సరైన భోజనం లేక ఆసుపత్రుల పాలవుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఒకవైపు 3.75 లక్షల కోట్ల అప్పులు చేసిన ప్రభుత్వం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు మాత్రం ఒక్క రూపాయి విడుదల చేయకపోవడం దుర్మార్గం. రైతుబంధును మూడుసార్లు ఎగ్గొట్టి రైతులను దగా చేశారు. ఇప్పుడు ఫీజుల పథకానికి మంగళం పాడేందుకు దొడ్డిదారులు వెతుకుతున్నారు" అని కేటీఆర్ దుయ్యబట్టారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలుంటాయని కేటీఆర్ హెచ్చరించారు. "ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ చీకటి జీవోను వెంటనే రద్దు చేయాలి. లేదంటే 14 లక్షల మంది విద్యార్థులతో కలిసి కాంగ్రెస్ సర్కారుపై సమరశంఖం పూరిస్తాం. ఇప్పటికే రైతుల ఆందోళనలతో రాష్ట్రం అట్టుడుకుతోంది. దీనికి విద్యార్థుల ఆగ్రహం కూడా తోడైతే ముఖ్యమంత్రి, మంత్రులు రోడ్లపై తిరగలేని పరిస్థితి వస్తుంది" అని కేటీఆర్ తన లేఖలో స్పష్టం చేశారు.



## తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే : ఎంపీ అర్వింద్

నిజామాబాద్ మే 03: ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ తన సత్తా చాటనుందని, ఐదు రాష్ట్రల్లో బీజేపీ అధికారంలోకి రానుందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. నిజామాబాద్ నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎంపీ అర్వింద్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ లో బీజేపీ భారీ మెజారిటీతో గెలవబోతుందని ఎంపీ అన్నారు. తెలంగాణాలోనూ రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం వెలువడే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు బీజేపీ కి అనుకూలంగా రానున్నాయన్నారు.

**తెలంగాణలో కమిషన్ ప్రభుత్వం..**

తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కమిషన్ ప్రభుత్వం నడుస్తోందని, అవినీతి పాలన కొనసాగుతోందని ఎంపీ అర్వింద్ అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో, పరిపాలనలో రేవంత్ ఘోరంగా ఫెయిల్ అని ఎంపీ అన్నారు. కాంగ్రెస్ పాలన చూస్తుంటే పాలనపై రేవంత్ కు ఏమాత్రం అవగాహన లేదని అర్థమవుతోందన్నారు. జిల్లాలో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరగాల్సి ఉండగా, ఇప్పటి వరకు 2 లక్షల మెట్రిక్ టన్నులు కూడా సేకరించలేక పోవడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతకాని తనమే అని ఆయనన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఇంతటి జాప్యం జరుగుతోంటే జిల్లాకు చెందిన ప్రభుత్వ సలహాదారులు ఇద్దరు ఉండి ఏం చేస్తున్నారని అర్వింద్ ప్రశ్నించారు.

**హామీలు మరిచాడు..**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను రేవంత్ రెడ్డి మర్చిపోయారని అర్వింద్ అన్నారు. మహిళా సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన బిల్లును అడ్డుకుని కాంగ్రెస్ పార్టీ మహిళలను వంచించిందన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్ పాపులర్ లీడర్ అని ఎంపీ అన్నారు. ఆయన చుట్టూ ఏం జరుగుతుందో తెలుసుకోలేక పోతున్నారన్నారు. పేద ప్రజలకు ప్రతినెలా రేషన్ బియ్యం ఉచితంగా సరఫరా చేసేది కేంద్ర ప్రభుత్వమేనని ఎంపీ అన్నారు. రైతులు పండించే ప్రతి ధాన్యపు గింజను ఎఫ్ సి ఐ కొనుగోలు చేస్తోందని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ కారణంగానే పసుపుకు అధిక ధరలు వస్తున్నాయని, ఆర్థికంగా రైతులకు ప్రయోజనం కలుగుతోందని ఎంపీ అన్నారు. తెలంగాణలో రూ.7800 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కోసం ఈ నెల 10న మోదీ రాష్ట్రానికి వస్తున్నారని, ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని ఎంపీ అర్వింద్ ప్రజలకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**ప్రజల్ని మత్తుకు బానిసలను చేసిన కేసీఆర్..**

తెలంగాణ ప్రజలను కేసీఆర్ మత్తుకు బానిసలను చేశారని, తెలంగాణలో కేసీఆర్ శకం ముగిసినట్లేనన్నారు. ఇటీవల జగిత్యాలలో జరిగిన బిఆర్ఎస్ సభకు ఐదారు వేలకు మించి జనాలు రాలేరన్నారు. జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ లో ఎందుకు చేర్చుకున్నారో పాపం కేసీఆర్ కు కూడా తెలియదనుకుంటున్నానన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలుబీజేపీ హవాలో కొట్టుకుపోతాయని ఎంపీ అర్వింద్ అన్నారు.

**గెలుపే లక్ష్యంగా మోడీ పర్యటన..**

రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మోదీ తెలంగాణలో పర్యటిస్తున్నారని, ఈ నెల 10 హైదరాబాద్ లో జరిగే మోడీ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని మోడీ సభ జిల్లా ప్రభారీ, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పిలుపునిచ్చారు. మోదీ నాయకత్వంలో దేశం చాలా భద్రతగా ఉందని దేశ ప్రజలు ఫీల్ అవుతున్నారని ఆయన అన్నారు. మీడియా సమావేశంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు దినేష్ కులాచారి పటేల్, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, పార్టీ నాయకులు స్రవంతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాదులో డ్రంక్ అండ్ డ్రైవ్... 700 మందికి పైగా దొరికారు!



హైదరాబాద్/సైబరాబాద్, మే 3: హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో వారాంతంలో నిర్వహించిన స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో భారీ సంఖ్యలో మందుబాబులు పట్టుబడ్డారు. రెండు కమిషనరేట్లలో కలిపి మొత్తం 728 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మే 1, 2 తేదీల్లో నిర్వహించిన తనిఖీల్లో 445 మందిని పట్టుకున్నారు. వీరిలో 371 మంది ద్విచక్ర వాహనదారులు, 26 మంది త్రీవీలర్ వాహనదారులు, 48 మంది కార్లు, ఇతర వాహనాల డ్రైవర్లు ఉన్నారు. పట్టుబడిన వారి బ్లడ్ ఆల్కహాల్ కంటెంట్ (బీఏసీ) స్థాయిల ఆధారంగా కేసులు నమోదు చేసినట్లు జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) తెలిపారు. మరోవైపు, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 283 మంది పట్టుబడ్డారు. వీరిలో 227 మంది టూవీలర్ డ్రైవర్లు, 39 మంది కార్ డ్రైవర్లు, 9 మంది త్రీవీలర్, 8 మంది భారీ వాహన డ్రైవర్లు ఉన్నారు. పట్టుబడిన వారందరినీ కోర్టులో హాజరుపరుస్తామని అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు కీలక హెచ్చరికలు జారీ చేశారు. మద్యం సేవించి వాహనం నడిపి ప్రాణాంతక ప్రమాదాలకు కారణమైతే, భారతీయ న్యాయ సంహిత, 2023లోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తామని సైబరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. ఈ సెక్షన్ ప్రకారం గరిష్టంగా 10 సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తామని, ఈ స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

## కారంపూడి దోపిడీ దొంగల అరెస్టు.. 566 గ్రాముల బంగారం స్వాధీనం



గురజాల: కారంపూడిలో బంగారు నగలను దోచుకుపోయిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 566 గ్రాముల బంగారం, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను పల్నాడు జిల్లా ఎస్పీ కృష్ణారావు గురజాల డీఎస్పీ కార్యాలయంలో వెల్లడించారు. వినుకొండకు చెందిన యక్కల శ్రీనివాసరావు హోల్‌సేల్‌గా బంగారు నగలను జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని దుకాణాలకు విక్రయిస్తుంటారు. ఇతని వద్ద బంగారు నగలు కాజేయాలని కారంపూడిలోని ఓ బంగారు నగల దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్న నరసరావుపేట మండలం పమిడిపాడుకు చెందిన గోసుల సాంబయ్య.. గుంటూరులోని గుజ్జన గుండ్లకు చెందిన గోగుల పవన్‌తో కలిసి పథకం వేశాడు. వీరికి గుంటూరుకు చెందిన కాండ్రగుంట శశికుమార్, కాండ్రగుంట సాయికిరణ్, అన్నం నిఖిల్‌మహేశ్, నాదెండ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన బండారు అజిత్ సహకరించారు. గత నెల 27న యక్కల శ్రీనివాసరావు కారంపూడికి నగలు తీసుకొస్తుండగా పథకం ప్రకారం గోగుల పవన్, అతని స్నేహితులు ద్విచక్ర వాహనాలపై వచ్చి దాడి చేసి నగల బ్యాగును తీసుకుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కారంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. కారంపూడి సీఐ శరత్‌బాబు, నరసరావుపేట పట్టణ ఎస్సై వంశీ, స్పెషల్‌బ్రాంచి ఎస్సై షఫీ, ఎస్సై వాసు నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు మొదలుపెట్టారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దొంగలను గుర్తించి అరెస్టు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న బంగారు నగల విలువ రూ.60 లక్షలు ఉంటుందని తెలిపారు. సమావేశంలో డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, కారంపూడి సీఐ శరత్‌బాబు పాల్గొన్నారు.

## వర్షంలోనూ... 'భరోసా'!




వాన ధారగా కురుస్తోంది.. బయట ఉంటే తడిసి ముద్ద అవ్వక తప్పని పరిస్థితి. కానీ, తమ గోడు వినే 'పెద్దన్న' వచ్చాడని తెలిసి ఆ వానను కూడా ప్రజలు లెక్కచేయలేదు. ప్రజల కష్టాలు తీర్చేందుకు వచ్చిన మంత్రి పొంగులేటి సైతం వర్షానికి వెరవలేదు. సభా ప్రాంగణం తడిసినా, స్కూలు గదిని వేదికగా చేసుకుని బాధితుల కన్నీళ్లు తుడిచారు. పాలేరు నియోజకవర్గంలో ఆదివారం సాయంత్రం జరిగిన 'ప్రజా దర్బార్'లో కనిపించిన దృశ్యమిది!

*** చినుకు పడినా.. చిక్కులు విన్నవించిన జనం**

తిరుమలాయపాలెం మండలం బచ్చోడు క్లస్టర్ పరిధిలోని 12 గ్రామ పంచాయతీల ప్రజల కోసం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు. సభ సాగుతున్న తరుణంలో ఒక్కసారిగా వాతావరణం మారి వర్షం కురిసింది. జనం చెల్లాచెదురవుతున్న సమయంలో మంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. వెంటనే పాఠశాలలోని ఒక తరగతి గదిలోకి వెళ్లి, అక్కడే బెంచీలపై కూర్చుని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వర్షంలో తడుస్తూ వచ్చిన బాధితులకు "నేను ఉన్నాను.. మీ సమస్యలు త్వరగా పరిష్కరిస్తాం" అని అభయమిచ్చారు.

*** చెప్పులు అరిగేలా తిరిగే రోజులు పోయాయి!**

అంతకుముందు సభను ఉద్దేశించి మంత్రి ప్రసంగిస్తూ... "ప్రజలు తమ సమస్యల కోసం ఆఫీసుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగే పాత పద్ధతులకు స్వస్తి పలకాలి. ప్రభుత్వమే నేరుగా మీ గడప వద్దకు వచ్చి సేవలు అందించాలనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష. అందుకే ఈ క్లస్టర్ స్థాయి ప్రజా దర్బార్లను నిర్వహిస్తున్నాం" అని పేర్కొన్నారు.

## తెలంగాణలో పలు జిల్లాల్లో వర్షం.. నేలకొరిగిన చెట్లు




హైదరాబాద్: తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడ్డాయి. ఎండవేడితో అల్లాడుతున్న ప్రజలకు వానలు ఉపశమనం కలిగించాయి. సూర్యాపేటలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. ఇక్కడి మార్కెట్‌యార్డులో ధాన్యం, మొక్కజొన్న తడవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రి, రామకృష్ణాపూర్‌లో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మందమర్రి, సింగరేణి కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. ములుగు జిల్లా ఏటూరు నాగారంలో గాలి దుమారంతో భారీ వర్షం పడింది.





## ఆ రాజకీయ నాయకులతో రైతులు జాగ్రత్త..!

రైతులను తమ రాజకీయాల ప్రయోజనాల కోసం వాడుకోవద్దని అలాంటి రాజకీయ నాయకులతో రైతులు జాగ్రత్తగా ఉండాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం జైనథ్ మార్కెట్ యార్డులో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి ఆయన మాట్లాడారు. రాజకీయ నాయకులు తమ ప్రయోజనాల కోసం రైతులను వాడుకోవద్దని తెలిపారు. గోదాంలలో సరఫరా లేకపోవడం వల్ల కొనుగోలు ఆలస్యం అయిందని.. కానీ కొన్ని రాజకీయ నాయకులు తమ ధర్నా వల్ల కొనుగోలు జరుగుతుందని ప్రజలను మభ్యపెడుతున్నారని తెలిపారు.

# కల్తీ పాలు.. గుర్తించడం ఇలా

ఇప్పుడు పాలు కొనుగోలు చేయాలంటేనే భయమేస్తోంది. ఏది కల్తీయో.. ఏవి అసలైన పాలో తెలియడం కష్టంగా మారింది. పాలు తరచుగా నీరు, డిటర్జెంట్, యూరియా, ఫార్మాలిన్ వంటి హానికరమైన పదార్థాలతో మిశ్రమితు కల్తీ జరుగుతుంది. ఇలా కల్తీ చేసిన పాలు తగడం మూలంగా ఆరోగ్యం క్షీణిస్తుంది. ఎఫ్ఎస్ఎస్ఏఐ ద్వారా అందించబడిన కొన్ని సులభమైన పరీక్షలు ఇంటి నుంచే చేసుకోవచ్చు. ఈ పరీక్షలు చేయడం ద్వారా పాలను శుద్ధి ఎంతగా ఉందో నిర్ధారించుకోవచ్చు. అయితే మనం వాటి గురించి తెలుసుకుందాం.

**డిటర్జెంట్ పరీక్ష**: 5 మి.లీ పాల్ని ఒక పారదర్శక గ్లాసులో తీసుకుని, సమానంగా నీటిని కలపండి. బాగా కలపండి. శుద్ధమైన పాలు ఎటువంటి ఫోమ్ లేకుండా ఉండాలి లేదా కాస్త ఫోమ్ ఏర్పడుతుంది, డిటర్జెంట్ తో మిశ్రమితమైన పాలు స్థిరమైన ఫోమ్ కలిగించును.

**యూరియా పరీక్ష**: 5 మి.లీ పాల్ని ఒక పరీక్షా ట్యూబ్ లో తీసుకోండి. అంతకు సమానంగా సోయాబీన్ లేదా అహర్ పౌడర్ కలపండి. బాగా కలపండి మరియు 5 నిమిషాలు వేచి ఉండండి. ఇది లిటమస్ కాగితం కలపండి. రెడ్ లిటమస్ పేపర్ ఎరుపు రంగులో ఉంటే, పాలు శుద్ధమైనది; నీలం రంగులో మారితే, పాలు యూరియా తో మిశ్రమితమై ఉన్నది.

**ఫార్మాలిన్ పరీక్ష**: 10 మి.లీ పాల్ని ఒక పరీక్షా ట్యూబ్ లో తీసుకోండి, ట్యూబ్ యొక్క పక్కలకు 23 చుక్కలు ఘన సల్ఫ్యూరిక్ ఆమ్లం కలపండి. పాల యొక్క రంగు మారదు అంటే పాలు శుద్ధమైనది; ఎరుపు లేదా నీలం వలయాలు ఏర్పడితే, పాలు ఫార్మాలిన్ తో మిశ్రమితమై ఉన్నది.

సింథటిక్ పాల పరీక్ష: 5 మి.లీ పాల్ని మరియు 5 మి.లీ నీటిని ఒక పరీక్షా ట్యూబ్ లో కలపండి. బాగా కలపండి. ఇది స్థిరమైన ఫోమ్ రూపొందించకపోతే, పాలు శుద్ధమైనది; మరియు స్థిరమైన ఫోమ్ ఏర్పడితే, ఇది సింథటిక్ డిటర్జెంట్ తో మిశ్రమితమై ఉంది.

**నీరు పరీక్ష**: ఈ పరీక్ష కోసం, పాల యొక్క ఒక చుక్కను ఒక మృదువుగా మరియు అడ్డంగా ఉన్న ముడి మీద ఉంచండి. చుక్క అక్కడ నిలబడితే లేదా నెమ్మదిగా పులకించుకుంటే, పాలు శుద్ధమైనది. మరియు అది త్వరగా పాడయితే, నీరు కలిసిన పాలు. ఈ పరీక్షలను చేస్తూ, వినియోగదారులు తినే పాల యొక్క శుద్ధతను నిర్ధారించుకోవచ్చు.

## పాల పోషక విలువలు

పాలు సుమారు 150 కేలొరీస్, 8 గ్రా ప్రోటీన్, 8 గ్రా కొవ్వు, 12 గ్రా కార్బోహైడ్రేట్లు, 300 మి.గ్రా కెల్సియం, 2.5 మి.గ్రా విటమిన్ డీ, 1.2 మైక్రోగ్రా విటమిన్ బీ12, 0.4 మి.గ్రా రిబోఫ్లవిన్ బీ2, మరియు సుమారు 400 మి.గ్రా పొటాషియం కలిగి ఉంటుంది.

పాల కల్తీ ఇలా జరుగుతుంది..

పాల కల్తీ అనేది పాలు నాణ్యతను తగ్గించడం లేదా ఇతర రసాయనలు కలిపి కల్తీ చేస్తుంటారు. పాలకు బదులైనవి లేదా ఇతర దిగువ నాణ్యత గల పదార్థాలను కలిపి ఉంచడం జరుగుతుంది. పాలను సాధారణంగా నీరు, డిటర్జెంట్లు, ఆహార మైదా, యూరియా, సింథటిక్ పాల, ఫార్మాలిన్, రంగు పదార్థాలు మరియు చక్కెరతో మిశ్రమం చేస్తారు. ఇలాంటి పాలను పరీక్షలు చేయకుండా కల్తీ పాలుగా గుర్తించడం కష్టంగా ఉంటుంది.

### పాలు మిశ్రమితంగా ఉండటానికి కారణాలు

విశేషజ్ఞుల ప్రకారం, ఇది అమ్మకదారుల లాభాలు పెంచేందుకు సహాయపడుతుంది, ఎందుకంటే అసలైన పాల పరిమాణం తక్కువగా మారుతుంది. ఇది పాలను పోషక విలువలో తీవ్రంగా తగ్గించడంతో పాటు శరీరంలో అనేక మార్పులకు దారితీస్తుంది.

కల్తీ పాలతో ఆరోగ్య సమస్యలు

ఆరోగ్య నిపుణుల ప్రకారం పాలలో చేర్చిన హానికరమైన పదార్థాల కారణంగా వివిధ ఆరోగ్య ప్రమాదాలు ఉంటాయి. ఇది కడుపు నొప్పి,వికారం వంటి సమస్యలను కలిగించవచ్చు. అలాగే, యూరియా, ఫార్మాలిన్ వంటి మిశ్రమిత పదార్థాలు మూత్రపిండాలను ఒత్తిడికి గురి చేయస్తాయి. కన్ని సార్లు దీర్ఘకాలిక హాని లేదా మూత్ర పిండాలు పని చేయని సమస్యలను కలిగించవచ్చు. కొందరిలో ఈ మిశ్రమాల కారణంగా చర్మ సమస్యలు, కద్దు, శ్వాస సంబంధిత సమస్యలు వస్తుంటాయి. ఫార్మాలిన్ దీర్ఘకాలికంగా ఉపయోగిస్తే కాలేయానికి గంభీరమైన ఆరోగ్య సమస్యలు, మరణం వంటి సమస్యలకు దారితీస్తుంది. కొన్ని మిశ్రమాలు శరీరంలో హార్మోనల్ సమతుల్యతను ప్రభావితం చేయవచ్చు, వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయి. మరియు చివరగా, మిశ్రమిత పాలను దీర్ఘకాలికంగా తీసుకోవడం మూత్రపిండ వ్యాధి క్యాన్సర్ వంటి దారుణ పరిస్థితుల ప్రమాదాన్ని పెంచవచ్చు.

### ఇంటిలో పాల శుద్ధిని ఎలా తనిఖీ చేయాలి?

భోజన భద్రత మరియు ప్రమాణాల అథారిటీ ఆఫ్ ఇండియా ప్రకారం, ఇంటిలో పాల శుద్ధిని తనిఖీ చేసేందుకు కొన్ని సులభమైన పద్ధతులు ఉన్నాయి. కొన్ని సులభమైన పద్ధతులను పరిశీలించండి:

ఆహార మైదా పరీక్ష: 23 మి.లీ పాల్ని ఉడికించి, చల్లబడనిచ్చండి. పాలలో 23 చుక్కలు ఐడైన్ ద్రావణం కలపండి. పాలు శుద్ధంగా ఉంటే, రంగు మార్చదు లేదా కాస్త పసుపు రంగులో మారుతుంది, అయితే నీలం రంగులో మారితే, ఇది ఆహార మైదాతో మిశ్రమం చేయబడింది.









# చిటికెలో చికెన్ కర్రీని ఇలా చేయండి

**త్వరత్వరగా ఏదైనా వండుకోవాలని ఉందా? కమ్మగా కోడికూరను 10 నిమిషాల్లోనే సిద్ధం చేసుకోవచ్చు. ఈజీ చికెన్ కర్రీ రెసిపీని ఇక్కడ చూడండి.**

మీకు ఇప్పటికిప్పుడే కోడికూర తినాలని ఉందా? కేవలం 10-15 నిమిషాల్లోనే కోడికూరను సిద్ధం చేసుకోవచ్చు. మీ వద్ద సమయం లేనపుడు, వెంటనే చేసుకోవడానికి ఈ చికెన్ కర్రీ రెసిపీ మీకు ఉపయోగపడుతుంది. మీరు చికెన్ స్థానంలో రొయ్యలను కూడా చేర్చుకోవచ్చు. రొయ్యలకైతే కేవలం 10 నిమిషాల కంటే తక్కువ సమయం చాలు. మీరు ఏది చేసుకోవాలనుకున్నా, ప్రాసెస్ ఇదే. ఆలస్యం ఎందుకు, రెసిపీ చదివి మీరూ ప్రయత్నించండి మరి.

| కావలసినవి |
|---|
| 200 గ్రా బోన్‌లెస్ చికెన్ |
| 2-3 టొమాటోలు |
| 1 ఉల్లిపాయ |
| 2 టీస్పూన్ల అల్లం వెల్లుల్లి పేస్ట్ |
| 2 స్పూన్ల కారం |
| 1/4 స్పూన్ పసుపు |
| 1 స్పూన్ గరం మసాలా |
| 1 టేబుల్ స్పూన్ పొద్దుతిరుగుడు నూనె |
| 3 టేబుల్ స్పూన్లు పెరుగు |
| కొన్ని కొత్తిమీర ఆకులు |
| రుచికి తగినంత ఉప్ప |

### చికెన్ కూర తయారీ విధానం

ముందుగా చికెన్ ముక్కలను శుభ్రంగా కడిగి పక్కనపెట్టుకోండి, టొమాటోలు, ఉల్లిపాయలు కడిగి ముక్కలుగా కోసి పెట్టుకోండి. ఇప్పుడు బాణలిలో నూనె వేసి, వేడయ్యాక ఉల్లిపాయలు వేసి రంగు మారేంత వరకు వేయించాలి. ఆపైన అల్లం వెల్లులి పేస్ట్ వేసి వేయించాలి. ఇప్పుడు టొమాటో ముక్కలు వేసి పసుపు, ఉప్పు, కారం వేసి మెత్తగా వేయించాలి, ఆపైన పావు వంతు నీళ్లు పోసి 2 నిమిషాలు ఉడికించాలి.

అనంతరం చికెన్ ముక్కలు వేసి, పైనుంచి గరం మసాలా వేసి మూతపెట్టి చికెన్ ఉడికేంత వరకు 1015 నిమిషాలు ఉడికించాలి. చివరగా పెరుగు వేసి కలపాలి, కొత్తిమీర చల్లుకోవాలి.అంతే, చికెన్ కర్రీ రెడీ. అన్నంతో కలిపి లంచ్ లేదా డిన్నర్ లో తింటూ రుచిని ఆస్వాదించండి.



## చమురు ఉత్పత్తి పెంపునకు ఒపెక్ ప్లస్ ఓకే..



**న్యూఢిల్లీ:** జూన్ నెలలో చమురు ఉత్పత్తి కోటాను పెంచేందుకు చమురు ఎగుమతి దేశాల సమాఖ్య ఒపెక్ం సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, ఇరాన్- అమెరికా వ్యవహారం కొలిక్కి రాకపోవడం, హర్మూజ్ జలసంధి ఇంకా తెరుచుకోకపోవడంతో వాస్తవంలో ఒపెక్ం దేశాలు చమురు ఉత్పత్తిని పెంచే పరిస్థితిలో లేవు. దీంతో ఈ అంగీకారం కేవలం కాగితాలకే పరిమితం కానుంది.

ఫిబ్రవరి చివర్లో ప్రారంభమైన యుద్ధం కారణంగా ప్రపంచంలోనే చమురు రవాణాకు అత్యంత కీలక మార్గం 'హర్మూజ్ జలసంధి' మూతపడింది. దీనివల్ల చమురు ఎగుమతులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియా, కువైట్, అల్జీరియా, కజక్స్థాన్, రష్యా, ఒమన్ దేశాలు ఆదివారం సమావేశమై చమురు ఉత్పత్తి పెంపునకు పచ్చజెండా ఊపాయి. రోజుకు 1,88,000 బ్యారెళ్ల మేర చమురు ఉత్పత్తిని పెంచాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. ఇటీవల ఈ సమాఖ్య నుంచి యూఏఈ వైదొలిగిన సంగతి తెలిసిందే. అంతకుముందు జరిగిన సమావేశంలోనూ చమురు ఉత్పత్తి కోటాను రోజుకు 2,06,000 బ్యారెళ్ల మేర పెంచడానికి ఒపెక్ం అంగీకరించింది. ఇలా ఉత్పత్తి పెంచేందుకు నిర్ణయించడం వరుసగా ఇది మూడోసారి. కాల్పుల విరమణ కొనసాగుతున్నా ఉద్రిక్తతలు సద్దుమణిగితే ఆ మేర ఉత్పత్తి పెంచడం సాధ్యమవుతుంది.

### ఒక్క బ్యారెలూ ఎగుమతి చేయలేదు

గల్ఫ్ దేశాల్లో ఒకటైన కువైట్ ఏప్రిల్ నెలలో ఒక్క బ్యారెల్ చమురు కూడా ఇతర దేశాలకు ఎగుమతి చేయలేదని ట్యాంకర్‌ట్రాకర్ వెబ్‌సైట్ పేర్కొంది. 1991 గల్ఫ్ వార్ తర్వాత నెల రోజుల్లో ఒక్క బ్యారెల్ చమురు కూడా ఎగుమతి చేయకపోవడం ఇదే తొలిసారి అని పేర్కొంది. ఎగుమతిని చేయనప్పటికీ.. ఉత్పత్తి చేసిన క్రూడాయిల్‌ను ఆ దేశం కొంతమేర స్టోరేజీ చేస్తోందని, మరికొంత క్రూడాయిల్‌ను రిఫైన్ ఉత్పత్తులుగా మారుస్తోందని ట్యాంకర్ ట్రాకర్ తెలిపింది.

## సాఫ్ట్‌వేర్ రంగంలో 18 ఏళ్ల అనుభవం..

### ఏఐ దెబ్బకి మెక్‌డొనాల్డ్స్‌లో..



**న్యూఢిల్లీ:** సాంకేతిక రంగంలో కృత్రిమ మేధ సంచలనాలు సృష్టిస్తోంది. ఈ ఏఐ కారణంగా ఉద్యోగాలు పోతాయనే ఆందోళన రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఈ క్రమంలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా ఏళ్ల అనుభవం ఉండి.. ఏఐ కారణంగా ఉద్యోగం కోల్పోయానంటూ ఓ వ్యక్తి పెట్టిన పోస్టు నెట్టింట తెగ వైరల్ అవుతోంది.

ఏఐ కారణంగా ఎనిమిది నెలల క్రితం తాను ఉద్యోగం కోల్పోయానంటూ ఆ వ్యక్తి తన పోస్టులో పేర్కొన్నాడు. తమ బృందంలో 12 మంది ఐటీ ఉద్యోగులం ఉండేవాళ్లమని, కంపెనీ మా అందరినీ తొలగించి కేవలం ఇద్దరు ఏఐ నిపుణులను నియమించుకుందని తెలిపాడు. 100కు పైగా ఉద్యోగాలకు అప్లై చేసినా జాబ్ దొరకలేదని వెల్లడించాడు. చివరకి కుటుంబ పోషణ కోసం ప్రస్తుతం మెక్‌డొనాల్డ్స్‌లో చేరినట్లు తెలిపాడు. తనకు తెలిసిన అనేక మంది అనుభవజ్ఞులైన ఇంజినీర్లు కూడా ప్రస్తుతం ఇదే సమస్యను ఎదుర్కొంటున్నట్లు తెలిపాడు. వారిలో కొందరు సంబంధంలేని ఉద్యోగాల్లో చేరినట్లు వెల్లడించాడు. ఈ పోస్టు తాజాగా నెట్టింట తీవ్ర చర్చకు దారి తీయగా.. నెటిజన్లు దీనిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఆ ఇంజినీర్ ఆవేదనను సమర్థిస్తూ కామెంట్లు పెడుతుండగా. మరికొందరు అనుభవం ఉన్నవారు ఏఐ సాధనాలు నేర్చుకుంటే.. వారికి డిమాండ్ పెరుగుతుందని పేర్కొంటున్నారు.

## శాంసంగ్ పరిమితకాలపు ఆఫర్..

### ఈ మోడల్‌పై రూ. 9వేల వరకు తగ్గింపు!



**న్యూఢిల్లీ:** ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ శాంసంగ్ మొబైల్ కొనుగోలుదారులకు గుడ్‌న్యూస్ చెప్పింది. ఎంపిక చేసిన మోడళ్లపై పరిమితకాలపు డిస్కౌంట్‌ను ప్రకటించింది. మే 3 నుంచి 27 వరకు డీలర్ ప్రోత్సాహక పథకాన్ని తీసుకొచ్చింది. దీంతో కొనుగోలుదారులకు ప్రయోజనం కలగనుంది. గత నెల కొన్ని స్మార్ట్‌ఫోన్లపై ధరలు పెంచిన శాంసంగ్.. ఇప్పుడు డిస్కౌంట్ ప్రకటించడం గమనార్హం.

శాంసంగ్ ఎస్26 అల్ట్రాపై గరిష్ఠంగా రూ.9 వేలు తగ్గింపు ఇస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. గెలాక్సీ 26 స్మార్ట్‌ఫోన్ మీద రూ.8 వేలు తగ్గింపు ఇస్తున్నట్లు శాంసంగ్ ప్రకటించింది. మిడ్‌రేంజ్ సెగ్మెంట్‌లో లభించే గెలాక్సీ ఏ57పై రూ.7వేలు తగ్గనుంది. దీంతో రూ.56వేలు ఉన్న ఈ ఫోన్ రూ.49,999కు తగ్గనుంది. గెలాక్సీ ఏ37 మోడల్‌పై రూ.5 వేలు చొప్పున తగ్గిస్తున్నట్లు శాంసంగ్ ప్రకటించింది. దీంతో ఈ ఫోన్ ధర రూ.36,999కు లభించనుంది.

ప్రస్తుతం ఈ స్మార్ట్‌ఫోన్లపై లభిస్తున్న బ్యాంక్ ఆఫర్, ఎక్స్ఛేంజీ బోనస్‌కు ఈ డిస్కౌంట్ అదనం. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కొనుగోళ్లపై ఈ డిస్కౌంట్లు లభ్యమవుతాయి. అయితే, డీలర్‌ను బట్టి డిస్కౌంట్‌లో మార్పులుండొచ్చు. ఇన్వెంటరీ క్లియర్ చేయడంలో భాగంగా శాంసంగ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# గుజరాత్‌ను గెలిపించిన సుందర్..

### పంజాబ్‌కు వరసగా రెండో షాక్..!



**అహ్మదాబాద్:** టేబుల్ టాపర్ పంజాబ్ కింగ్స్‌కు వరసగా రెండో షాక్. లో స్కోరింగ్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 4 వికెట్ల తేడాతో పంజాబ్‌ను ఓడించింది. ఆఖరి ఓవర్ వరకూ ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో సాయి సుదర్శన్(57) అర్ధశతకంతో మెరవగా.. చివరిదాకా నిలబడిన సుందర్(40 నాటౌట్) గుజరాత్‌ను గెలిపించాడు. ఆఖరి ఓవర్లో సుందర్ ఫైనల్ లెగ్ సిక్సర్ బాదగా ఆరో విజయంతో గుజరాత్ ప్లే ఆఫ్స్ రేసులో నిలిచింది.

డబుల్ హెడర్ రెండో మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌పై గుజరాత్ టైటాన్స్ జయభేరి మోగించింది. మోస్తరు ఛేదనలో ఓపెనర్ సాయి సుదర్శన్(57) ఖతర్నాక్ హాఫ్ సెంచరీతో రాణించగా.. వాషింగ్టన్ సుందర్(40 నాటౌట్) మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. పంజాబ్‌ను 163కే కట్టడి చేసిన గుజరాత్ టైటాన్స్‌కు అర్ష్‌దీప్ సింగ్ ఆదిలోనే షాకిచ్చాడు. శుభ్‌మన్ గిల్(5) ఔటయ్యాక జోస్ బట్లర్(26), సాయి సుదర్శన్(57)లు ఇన్నింగ్స్ నిర్మించారు. గుజరాత్‌ను గెలుపు దిశగా నడిపిస్తున్న ఈ జోడీని ఇంప్యాక్ట్ సబ్ విజయ్ కుమార్ విడదీశాడు. నిశాంత్ సంధు(15).. విఫలమవ్వగా.. సుదర్శన్ దూకుడుగా ఆడి అర్ధశతకం సాధించాడు.

విజయ్ బౌలింగ్‌లో సిక్సర్ కొట్టాలనుకున్న అతడు బౌండరీ వద్ద బార్ట్‌లెట్ చేతికి చిక్కాడు. అప్పటికి గుజరాత్ విజయానికి 30 బంతుల్లో 41 రన్స్ కావాలి. సుందర్(40 నాటౌట్) నిలబడినా.. ఇంప్యాక్ట్ సబ్ తెవాటియా(2)ను యాన్సెన్ ఔట్ చేయడంతో పంజాబ్ ఆశలు చిగురించాయి. కానీ, బంతితో తమను దెబ్బకొట్టిన హోల్డర్(5)ను కొన్నొల్లీ అద్భుత క్యాచ్‌తో వెనక్కి పంపాడు. 6 బంతుల్లో 11 రన్స్ అవసరమవ్వగా.. అర్షద్ ఖాన్ బౌండరీ.. సుందర్ ఫుల్ టాస్‌ను ఫైన్ లెగ్‌లో సిక్సర్‌గా మలవగా 4 వికెట్ల తేడాతో గుజరాత్ గెలిచింది.


రాణించిన సూర్యాన్ష్, స్టోయినిస్

పంతొమ్మిదో సీజన్‌లో రికార్డు లక్ష్యాన్ని ఛేదించిన పంజాబ్ కింగ్స్‌ను అహ్మదాబాద్‌లో తడబడింది. సుడిగాలిలా విరుచుకుపడే ఓపెనర్లకు గుజరాత్ టైటాన్స్ బౌలర్లు బ్రేకులు వేయగా మోస్తరు స్కోరే కొట్టింది. తొలి ఓవర్లోనే సిరాజ్(2-28) డబుల్ షాకివ్వగా.. జేసన్ హోల్డర్(4-24) చకచకా మిడిలార్డర్ పని పట్టాడు.

47కే ఐదు కీలక వికెట్లు పడిన వేళ అన్‌క్యాప్డ్ ప్లేయర్ సూర్యాన్ష్ షెడ్గే(57), మార్కస్ స్టోయినిస్(40)లు నిలబడ్డారు. గుజరాత్ బౌలింగ్ దళాన్ని కాచుకొని స్కోర్ 120 దాటించారు. ఈ జోడిని హోల్డర్ విడదీయడంతో పంజాబ్ 163కే పరిమితమైంది.

## బ్రిజ్ భూషణ్ నన్నూ వేధించాడు..

### నేనూ బాధితురాలినే..!



**న్యూఢిల్లీ:** మాజీ రెజ్లర్, ప్రస్తుత ఎమ్మెల్యే వినేశ్ ఫొగాట్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసింది. తనను పునరాగమనం చేయకుండా భారత రెజ్లింగ్ సమాఖ్య అడ్డుకుంటుందని ఆరోపించిన వినేశ్ ఈసారి తాను బ్రిజ్ భూషణ్ బాధితురాలినే అంటూ ఎక్స్‌లో వీడియో పెట్టింది. రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా భూషణ్ వేధింపులకు బలైన ఆరుగురిలో నేను ఒకరు అని ఆ వీడియోలో చెప్పింది వినేశ్. అయితే.. కేసు కోర్టు పరిధిలో ఉన్నందున పూర్తి వివరాలు చెప్పడానికి ఆమె నిరాకరించింది.

భారత రెజ్లింగ్ సమాఖ్యతో పోరాడుతున్న వినేశ్ ఫొగాట్ తొలిసారి తాను బాధితురాలిని అని బహిరంగంగా ప్రకటించింది. ఆదివారం సోషల్ మీడియా ఎక్స్‌లో వీడియో పెట్టిన వినేశ్ తనను కూడా బ్రిజ్ భూషణ్ వేధించాడని చెప్పింది. 'సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం బాధితుల వివరాలు వెల్లడించకూడదు. ఎందుకంటే పేర్లు, వివరాలు బహిర్గతం చేయడం బాధితుల గౌరవం, పరువుకు భంగం కలిగిస్తుంది. అయినా సరే కొన్ని పరిస్థితుల కారణంగా నేను ఈరోజు మీకు ఓ విషయం చెప్పాలనుకుంటున్నా. కేసు కోర్టులో పెండింగ్‌లో ఉన్నందున నేను ఇన్నాళ్లు మాట్లాడలేదు. కానీ, మీకు ఒక విషయం చెప్పాలి.

బ్రిజ్ భూషణ్‌పై కేసు వేసిన ఆరుగురు బాధితుల్లో నేను ఒకరు. మేము సాక్ష్యాలను సమర్పించినా.. కేసు ఇంకా నడుస్తోంది అని వినేశ్ వెల్లడించింది. 2023లో రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా ఉన్న బ్రిజ్ భూషణ్‌ను పదవి నుంచి తొలగించాలని రెజ్లర్లు ధర్నాకు దిగిన విషయం తెలిసిందే. మహిళా రెజ్లర్లను అనుచితంగా తాకుతూ.. లైంగిక వేధింపులకు గురి చేసిన భూషణ్‌పై వేటు వేయాలని జరిగిన ఉద్యమానికి వినేశ్ ఫొగాట్ నాయకత్వం వహించింది. రెజ్లర్ల పోరాటంతో భూషణ్‌ను తప్పించి ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుత అధ్యక్షుడు సంజయ్ సింగ్ మాజీ చీఫ్ భూషణ్ చేతిలో కీలుబొమ్మ అని వినేశ్ విమర్శిస్తోంది. అందుకనే ఆసియా క్రీడలతో పునరాగమనం చేయాలనుకుంటున్న తనను రెజ్లింగ్ సమాఖ్య అడ్డుకుంటోందని ఆమె ఆరోపిస్తోంది.

## అపర కుబేరుడి చేతికి రాజస్థాన్ రాయల్స్..

### రూ.15 వేల కోట్లకు కొనేశాడు..!




**రాజస్థాన్:** ఐపీఎల్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ మరోసారి చేతులు మారింది. పంతొమ్మిదో సీజన్ ఆరంభానికి ముందు జైపూర్‌కు చెందిన ఈ ఫ్రాంచైజీని కల్ సొమాని గ్రూప్ కొనుగోలు చేయగా.. ఇప్పుడు బ్రిటన్‌లో నివసిస్తున్న ప్రవాస భారతీయుడు లక్ష్మి మిట్టల్ భారీ ధరకు దక్కించుకున్నాడు. 1.65 బిలియన్ డాలర్లకు (భారతీయ కరెన్సీలో రూ.15,660 కోట్లు) రాజస్థాన్ జట్టును ఈ వ్యాపార దిగ్గజం సొంతం చేసుకున్నాడు.

ఐపీఎల్ మధ్యలోనే రాజస్థాన్ రాయల్స్‌కు కొత్త బాస్ చేతుల్లోకి వెళ్లింది. స్టీల్ వ్యాపారంలో దిగ్గజం లక్ష్మి మిట్టల్ కుటుంబం భారీ ధరకు రాజస్థాన్ యాజమాన్యం హక్కులు సాధించింది. ఫ్రాంచైజీలో 75 శాతం వాటా మిట్టల్ కుటుంబానిది కాగా.. సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అడార్ పూనావాలా, మనోజ్ బడాలేలు సహ యజమానులుగా కొనసాగనున్నారు.

## సన్‌రైజర్స్‌కు ఊహించని స్ట్రోక్..

### ఆరో విజయాన్ని అడ్డుకున్న కోల్‌కతా..!



**హైదరాబాద్:** అదిరే ఆటతో వరస విజయాలతో దూసుకెళ్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ కల చెదిరింది. డబుల్ హ్యాట్రిక్‌తో టేబుల్ టాపర్ అవ్వాలనుకున్న కమిన్స్ సేనకు కోల్‌కతా నైట్ రైడర్స్ బిగ్ షాకిచ్చింది. మిస్టరీ స్పిన్నర్లు తిప్పేయడంతో హిట్టర్లతో నిండిన హైదరాబాద్‌ను 165 పరుగుల వద్దే ఆపిన కోల్‌కతా రఘువంశీ(59), సారథి అజింక్యా రహానే(43)ల విలువైన భాగస్వామ్యం నెలకొల్పారు. వైస్ కెప్టెన్ రింకూ సింగ్(18 నాటౌట్) లాంఛనం ముగించడంతో కోల్‌కతా మూడో విజయంతో మురిసింది.

పంతొమ్మిదో సీజన్‌లో చెలరేపోతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జోరుకు కోల్‌కతా నైట్ రైడర్స్ బ్రేకులు వేసింది. ఉప్పల్ స్టేడియంలో బ్యాటర్లు తేలిపోవడంతో తక్కువ స్కోర్ కొట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను బౌలర్లు కాపాడలేకపోయారు. స్వల్ప లక్ష్యాన్ని కోల్‌కతా ఆడుతూపాడుతూ ఛేదించింది. ఆరెంజ్ ఆర్మీని 165కే కట్టడి చేసిన కేకేఆర్‌కు ఓపెనర్లు శుభారంభమిచ్చారు.

ఫిన్ అలెన్(29), అజింక్యా రహానే(43)లు ఎడాపెడా దంచేశారు. నాలుగో ఓవర్లో అలెన్ ఊచకోతకు బలైన కమిన్స్ 27 పరుగులిచ్చుకున్నాడు. కానీ, చివరి బంతికి అతడి వికెట్ తీసి ఊపిరి పీల్చుకున్నాడు. అనంతరం వచ్చిన రఘువంశీ(59) కెప్టెన్‌తో కలిసి ఇన్నింగ్స్ నిర్మించాడు. అర్ధ శతకం భాగస్వామ్యంతో జట్టు విజయానికి బాటలు వేశారిద్దరు.

కోల్‌కతాను గెలుపు దిశగా నడిపించిన ఈ జోడీని విడదీసేందుకు సన్‌రైజర్స్ సారథి కమిన్స్ బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. జట్టు విజయానికి 33 రన్స్ అవసరమైన వేళ షకీబ్ ఓవర్లో రహానే ఔటయ్యాడు. కాసేపటికే రఘువంశీని శివాంగ్ వెనక్కి పంపాడు. అప్పటికే లక్ష్యం కరిగిపోగా.. వైస్ కెప్టెన్ రింకూ సింగ్(18 నాటౌట్), గ్రీన్(3 నాటౌట్) లాంఛనం ముగించారు. దాంతో, వరసగా ఆరో విజయంతో టాప్‌లోకి దూసుకెళ్లాలనుకున్న హైదరాబాద్ ఆశలు ఆడియాశలయ్యాయి.

## సిరా చుక్క సాక్ష్యం

కవిత

అక్షరాలు నశ్వరంకావు,
కాలం గడిచినా కరుగవు.
కలం గుండె నుంచి జాలువారి
ఒకదానికొకటి పెనవేసుకుని
పదాలై ప్రజల ముందుకు వస్తాయి.

కలం-గళం
ఈ రెండు పాదాలపైనే
ప్రజాస్వామ్యం నిలబడుతుంది.

కలం కన్ను తెరిస్తే
అవినీతి అడుగులు వెనక్కి పడతాయి,
గళం స్వరం ఎత్తితే
అక్రమాల గోడలు కూలిపోతాయి.

ప్రశ్నించే గొంతుకతోనే
ప్రగతి దారి కనిపిస్తుంది,
కలం కక్కిన అక్షరాలే
పత్రికకు ప్రాణం పోస్తాయి.

కానీ నేడు
పత్రిక గడప దాటి
రాజకీయం లోపలికి వచ్చి,
ప్రజాస్వామ్యాన్నే
నిశ్శబ్దంగా ఖూనీ చేస్తోంది.

నిజాన్ని నిగ్గు తేల్చాల్సిన కలం
రాజకీయ రంగు పులుముకుని,
వాస్తవం ముఖానికే
ముసుగు కడుతోంది.

పత్రికా స్వేచ్ఛ కాస్త
ప్రలోభాలకు లోనైతే,
రాజ్యాంగ హక్కుల గుండెల్లోనే
గాయాలు మిగులుతాయి.

ఇలాగే సాగితే
స్వేచ్ఛ, సమానత్వం అనే పదాలకు
నిఘంటువులో అర్థం ఉన్నా
జీవితాల్లో అర్థం ఉండదు.

అందుకే..
కలం విలువను పెంచుదాం,
నిజాలను వెలికితీద్దాం,
పత్రికా స్వేచ్ఛకు
మళ్లీ ప్రాణం పోదాం.

ఒక్క సిరా చుక్క
లక్ష మెదళ్లను కదిలించగలదు
ఆ చుక్కలోనే
రేపటి సమాజం దాగి ఉంది.

ఇడుకోజు రాఘవేంద్రచారి
నల్గొండ, సెల్ : 7382737668



MOVIE TIME

# ఓటీటీలోకి 'భరతనాట్యం 2: మోహినియాట్టం'



**టాకీస్:** మలయాళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టించిన బ్లాక్ బస్టర్ మూవీ 'భరతనాట్యం 2: మోహినియాట్టం' డిజిటల్ ప్రియుల ముందుకు వచ్చేస్తోంది. కృష్ణదాస్ మురళి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ డార్క్ కామెడీ థ్రిల్లర్, థియేటర్లలో భారీ వసూళ్లను సాధించడమే కాకుండా సుమారు రూ.40 కోట్ల కలెక్షన్లతో బాక్సాఫీస్ వద్ద విజేతగా నిలిచింది. ఇక థియేటర్‌లలో అలరించిన ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ వేదికగా మే 8వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. సైజు కురుప్, సూరజ్ వెంజరమూడు, జగదీష్, వినయ్ ఫోర్ట్ వంటి హేమాహేమీలు నటించిన ఈ సినిమాలో రాపర్ బేబీ జీన్ కీలక పాత్రలో మెరిశారు. 2024లో వచ్చిన 'భారతనాట్యం' సినిమాకు ఇది సీక్వెల్. మొదటి భాగంలో భరతన్ నాయర్ కుటుంబం చుట్టూ ఉన్న రహస్యాలు, కుటుంబ గౌరవం కోసం వారు పడే ఇబ్బందులను చూపించారు. ఈ రెండో భాగం ఆ కథను మరింత ముందుకు తీసుకెళ్తుంది. భరతన్ నాయర్ మరణం తర్వాత అతని కుటుంబ సభ్యులు ఎదుర్కొనే చిత్రవిచిత్రమైన సంఘటనల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ముఖ్యంగా భరతన్ నాయర్ రెండో భార్య మరియు ఆమె పిల్లలు కథలోకి ప్రవేశించినప్పుడు అసలు గందరగోళం మొదలవుతుంది. కుటుంబ సభ్యులందరూ కలిసి తమ పూర్వీకుల ఊరికి వెళ్లాల్సి వస్తుంది. అక్కడ వారికి అనుకోని విధంగా కొన్ని వింతైన, అడపాదడపా భయపెట్టే సమస్యలు ఎదురవుతాయి. ఈ చిక్కుల నుంచి బయటపడటానికి వారు చేసే ప్రయత్నాలు, ఒకరినొకరు మోసం చేసుకోవడం, తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం వంటివి సినిమాలో డార్క్ కామెడీ శైలిలో చూపించారు. అస్సలు ఊహించని పరిస్థితుల్లో ఒక నేరంలో ఇరుక్కుపోయిన ఈ కుటుంబం, తమ తెలివితేటలతో ఆ సమస్య నుండి ఎలా బయటపడింది? తమ మధ్య ఉన్న మనస్పర్థలను ఎలా పరిష్కరించుకుంది? అనేది ఈ సినిమా కథ. గత ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, విలక్షణమైన కథనంతో మలయాళ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది.

# ఓటీటీలోకి అడివి శేష్ 'డెకాయిట్'..



**టాకీస్:** టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన ఇంటెన్స్ యాక్షన్ డ్రామా 'డెకాయిట్' (ఖుఎశీఱ) ఓటీటీ విడుదలకు సిద్ధమైంది. ఈ క్రేజీ యాక్షన్ చిత్రాన్ని ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో మే 8వ తేదీ నుండి స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. గత నెల ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, అడివి శేష్ మార్క్ యాక్షన్ మరియు మృణాల్ ఠాకూర్ పెర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. షానియల్ డియో దర్శకత్వం వహించిన ఈ చిత్రం, విడిపోయిన ఇద్దరు ప్రేమికులు మళ్ళీ కలుసుకున్నప్పుడు వారి జీవితాల్లో ఎదురైన సవాళ్లు మరియు ప్రతీకారం నేపథ్యంలో సాగుతుంది. ముఖ్యంగా బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఇందులో కీలక పాత్రలో నటించడం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది.



# గ్లామర్ పాత్రలకు బ్రేక్..

## శ్రీలీల కెరీర్‌లో కొత్త మలుపు

టాకీస్: టాలీవుడ్‌లో తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల ఇప్పుడు తన కెరీర్‌లో కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. 'పెళ్లిసందడి' సినిమాతో అలరించిన ఆమె, అద్భుతమైన డాన్స్, ఆకట్టుకునే నటనతో యువతలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. వరుసగా స్టార్ హీరోల సరసన నటిస్తూ కెరీర్ గ్రాఫ్‌ను వేగంగా పెంచుకున్నప్పటికీ, ఇటీవల ఆమె నటించిన కొన్ని భారీ సినిమాలు ఆశించిన విజయాన్ని అందుకోలేక పోయాయి. ఈ నేపథ్యంలో శ్రీలీల తన రూట్‌ను మార్చుకోవాలని నిర్ణయించు కున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు గ్లామర్, కమర్షియల్ పాత్రలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిన ఆమె, ఇకపై బలమైన కథాంశం ఉన్న సినిమాలపై దృష్టి పెట్టాలని భావిస్తోంది. ముఖ్యంగా కుటుంబ కథా చిత్రాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లో నటించాలని తన కోరికను వెల్లడించింది. ఇక ప్రస్తుతం ఈ యంగ్ హీరోయిన్ కోలీవుడ్‌పైనా ఫోకస్ పెంచింది. ఇప్పటికే 'పరాశక్తి' అనే తమిళ చిత్రంతో అక్కడి ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, ఇప్పుడు ధనుష్ సరసన ఆయన 55వ చిత్రంలో నటిస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నా యి. అలాగే బాలీవుడ్‌లో కూడా ఓ సినిమాతో బిజీగా ఉంది. అయితే తన కెరీర్ ప్రయాణంపై స్పందించి న శ్రీలీల, "వైవిధ్యభరితమైన పాత్రలే నటిగా నాలోని పూర్తి ప్రతిభను బయటకు తీస్తాయి. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కావడం ఇష్టం లేదు. ప్రేక్షకులకు గుర్తుండిపోయే పాత్రలు చేయాలను కుంటున్నాను" అని పేర్కొంది. అందుకే ఇకపై కథల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తా నని తెలిపింది. శ్రీలీల చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆమె తీసుకున్న ఈ కొత్త దిశలోని నిర్ణయం కెరీర్‌కు ఎంతవరకు సహాయపడు తుందో చూడాలి. అయితే నటిగా మరింత వైవిధ్యం చూ పించాలని ఉన్న ఆమె తపనను అభిమాను లు స్వాగతిస్తున్నారు. కాగా, శ్రీలీల చివరిగా పవన్ కళ్యాణ్ నటించిన ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రంలో నటించింది.

# గ్రాండ్‌గా గోపీచంద్ కొత్త సినిమా ప్రారంభం..

**టాకీస్:** టాలీవుడ్ యాక్షన్ హీరో గోపీచంద్ తన 34వ సినిమాను లాంఛనంగా ప్రారంభించారు. ప్రముఖ ఫైట్ మాస్టర్ వి.వెంకట్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆదివారం ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ఘనంగా మొదలైంది. సీనియర్ నిర్మాత శ్యాంప్రసాద్ రెడ్డి క్లాప్ కొట్టగా, దిల్ రాజు కెమెరా స్విచాన్ చేశారు. 'గోపీచంద్ 34'గా తాత్కాలికంగా పిలుస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్నారు. 'యాత్ర', 'ఆనందో బ్రహ్మ' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఉన్నత నిర్మాణ విలువలతో ఒక రూటెడ్ యాక్షన్ డ్రామాగా దీన్ని రూపొందించనున్నట్లు నిర్మాతలు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ గురించి గోపీచంద్ మాట్లాడుతూ..




"ఇంతకుముందు నా సినిమాలకు వెంకట్ యాక్షన్ కొరియోగ్రఫీ చేశారు. ఆయన పనితనం అంటే నాకు ఎంతో ఇష్టం. ఇప్పుడు ఆయన దర్శకత్వంలో పనిచేయడం, నా స్నేహితులైన విజయ్, శశి నిర్మాణంలో ఈ ప్రయాణం మొదలుపెట్టడం చాలా సంతోషంగా ఉంది" అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. శామ్ సీఎస్ సంగీతం అందిస్తుండగా, శ్యామ్‌దత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, రామకృష్ణ-మోనిక ప్రొడక్షన్ డిజైనర్లుగా వ్యవహరించనున్నారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. హీరోయిన్, ఇతర నటీనటుల వివరాలు, రెగ్యులర్ షూటింగ్ షెడ్యూల్ త్వరలో ప్రకటిస్తామని చిత్రబృందం వెల్లడించింది.

# 'దేవర 2' ఆగిందంటూ ప్రచారాలు..

## అభిమానుల సందేహాలకు చెక్

టాకీస్: టాలీవుడ్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సీక్వెల్స్‌లో 'దేవర 2' ఒకటి. కానీ ఇప్పటివరకు ఈ సినిమాపై మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో నందమూరి అభిమానుల్లో కొంత ఆందోళన నెలకొంది. ముఖ్యంగా దర్శకుడు కొరటాల శివ, నందమూరి బాలకృష్ణతో కొత్త సినిమా ఖరారు చేసుకోవడంతో 'దేవర 2' ప్రాజెక్ట్ నిలిచిపోయిందనే వార్తలు జోరుగా వినిపించాయి. ఇక హీరో ఎన్టీఆర్ వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉండటం, కొరటాల శివ ఇతర సినిమాలపై దృష్టి పెట్టడం వంటి పరిణామాలు ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చాయి. దీంతో 'దేవర' సీక్వెల్ ఉంటుందా లేదా అన్న సందేహం అభిమానులను కలవరపెట్టింది. అయితే తాజా సమాచారం ప్రకారం అభిమానులు కంగారు పడాల్సిన అవసరం లేదని తెలుస్తోంది. 'దేవర 2' కథ ఇప్పటికే సిద్ధంగా ఉందని, ఎన్టీఆర్‌కు





కొరటాల శివ పూర్తి స్క్రిప్ట్‌ను వినిపించారని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఉన్న కమిట్‌మెంట్ల కారణంగా ఈ ప్రాజెక్ట్ ఆలస్యమవుతున్నప్పటికీ, ఈ కాంబినేషన్‌లో సీక్వెల్ రావడం ఖాయం అనే సంకేతాలు అందుతున్నాయి.మరోవైపు బాలకృష్ణ -- కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాను వేగంగా పూర్తి చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యాక, 2027 జనవరి నాటికి కొరటాల శివ ఫ్రీ అవుతారని సమాచారం. ఆ వెంటనే 'దేవర 2'ను సెట్స్‌పైకి తీసుకెళ్లే అవకాశాలు ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. దీంతో కొంత ఆలస్యమైనా, 'దేవర 2' ప్రాజెక్ట్ మాత్రం ఆగిపోలేదని స్పష్టమవుతోంది. కాబట్టి ఎన్టీఆర్ అభిమానులు ఇంకొంతకాలం వేచి చూడాల్సి ఉన్నా, వారు ఎదురుచూస్తున్న సీక్వెల్ మాత్రం ఖచ్చితంగా రానుందని చెప్పొచ్చు. దేవర చిత్రం మంచి విజయం సాధించడంతో ఇప్పుడు సీక్వెల్‌పై కూడా అంచనాలు భారీగా ఉన్నాయని చెప్పాలి.

# జూన్ 4న 'పెద్ది' ఎంట్రీ..

## 'రావు బహదూర్'తో క్లాష్‌పై ఇండస్ట్రీలో చర్చలు

టాకీస్: టాలీవుడ్‌లో ఆసక్తికరమైన బాక్సాఫీస్ పోటీకి రంగం సిద్ధమవుతోంది. రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' సినిమా విడుదల తేదీగా జూన్ 4ను అధికారికంగా ప్రకటించారు. మొదట ఇదే తేదీకి రావాల్సిన 'టాక్సిక్' వాయిదా పడటంతో, సమ్మర్ హాలిడేస్‌ను క్యాష్ చేసుకునేలా 'పెద్ది'ని బరిలోకి దింపుతున్నారు. అయితే ఇదే వారం విడుదలకు సిద్ధమైన మరో సినిమా 'రావు బహదూర్' ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మహేష్ బాబు నిర్మాణ భాగస్వామ్యంతో, సత్యదేవ్ హీరోగా, వెంకటేష్ మహా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సైకలాజికల్ డ్రామాను జూన్ 5న విడుదల చేయాలని మేకర్స్ ముందుగానే ప్రకటించారు. ఇప్పుడు 'పెద్ది' ఒక రోజు ముందుగా జూన్ 4న రావడంతో, ఈ రెండు చిత్రాల మధ్య క్లాష్ అనివార్యంగా కనిపిస్తోంది. భారీ క్రేజ్ ఉన్న 'పెద్ది'కి ఎక్కువ థియేటర్లు దక్కే అవకాశం ఉంది. దాంతో కంటెంట్ ఆధారిత చిత్రం అయిన 'రావు బహదూర్'కు సరిపడా స్క్రీన్లు దొరకడం సవాలుగా మారవచ్చు. థియేటర్ల కొరత ఏర్పడితే, సినిమా పాజిటివ్ టాక్ వచ్చినా కూడా వసూళ్లపై



ప్రభావం పడే ప్రమాదం ఉంది.అయితే 'రావు బహదూర్' టీమ్ మొదటగా జూన్ 4న యశ్ నటించిన 'టాక్సిక్' విడుదల ఉండబోతుందని తెలిసినా, అదే సమయానికి తమ చిత్రాన్ని రిలీజ్ చేయాలని నిర్ణయించుకుంది. ఇది తమ కంటెంట్‌పై ఉన్న నమ్మకాన్ని సూచిస్తుంది. కానీ ఇప్పుడు ఆ తేదీకి రామ్ చరణ్ సినిమా రావడం పరిస్థితిని మార్చేసింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.